ప్రజాశక్తి

గురువారం 17 అక్టోబర్ 2024 · 8 పేజీలు

ఎన్‌టిఆర్

కృష్ణా

కూలిన మహిళా హాస్టల్ ప్రహరీగోడ

ఐదు కార్లు ధ్వంసం

వార్త మెయిన్‌లో

నిర్లక్ష్యం వల్లే విజయవాడకు వరదలు

పిల్‌పై ప్రభుత్వానికి హైకోర్టు నోటీసులు

ప్రజాశక్తి - అమరావతి : విజయవాడకు వరదలు ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే వచ్చాయంటూ దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్)ను చీఫ్ జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్ ఆధ్వర్యంలోని డివిజన్ బెంచ్ బుధవారం విచారించింది. వెలగలేరు హెడ్ రెగ్యులేటర్ వద్ద గేట్లు ఎత్తేస్తామని అధికారులు చెప్పిన తర్వాత కూడా విజయవాడ వాసులను అప్రమత్తం చేయలేదంటూ జర్నలిస్టు నాతాని భూపతిరావు వేసిన పిల్‌పై విచారణను హైకోర్టు 8 వారాలకు వాయిదా వేసింది. 'ప్రభుత్వం విజయవాడ ప్రజలను అప్రమత్తం చేయలేదని, దీంతో తీవ్ర నష్టం వాటిల్లిందని, బాధ్యులైన వారందరిపై కఠిన చర్యలకు ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు. వరదల తర్వాత ప్రజలకు సాయం చేయడంలోనూ ప్రభుత్వం విఫలమైందని, ఇది మానవ హక్కుల ఉల్లంఘనేనని దాఖలైన పిల్‌లో ప్రభుత్వం కౌంటర్ దాఖలు చేయాలని హైకోర్టు ఆదేశించింది.

గ్రామీణులకు రక్షిత తాగునీరందించాలి

జడ్‌పి చైర్‌పర్సన్ ఉప్పాల హారిక

ప్రజాశక్తి - కలెక్టరేట్ (కృష్ణా) : గ్రామీణ ప్రాంతాల ప్రజలకు సురక్షిత తాగునీరు అందించేందుకు జిల్లా పరిషత్ నిధులు నుండి కోట్లాది రూపాయలు కేటాయిస్తున్నా సురక్షిత తాగునీరు అందించడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని జడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక అసహనం వ్యక్తం చేశారు. బుధవారం జెడ్పీ చైర్ పర్సన్ ఉప్పాల హారిక, వైస్ చైర్ పర్సన్ గరికిపాటి శ్రీదేవి అధ్యక్షతన స్థానిక జిల్లా పరిషత్ సమావేశపు

(మిగతా 2లో)

సమావేశంలో మాట్లాడుతున్న జడ్‌పి చైర్‌పర్సన్ ఉప్పాల హారిక

మల్లవల్లి పారిశ్రామిక పార్క్‌లో

349 మందికి భూమి కేటాయింపు

- మంత్రివర్గం నిర్ణయం
- నత్తనడకన పారిశ్రామిక ప్రగతి
- అసంపూర్తిగా మౌలిక వసతులు
- గతంలో 350కి పైగా కేటాయింపులు రద్దు
- అశోక్ లేలాండ్లో ఇంకా ప్రారంభంకాని ఉత్పత్తి

ప్రజాశక్తి - కృష్ణా ప్రతినిధి

'ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ చాలదు... ఫాస్టాఫ్ డూయింగ్ బిజినెస్ కావాలి. అందుకే పారిశ్రామిక ప్రగతిని పరుగులు పెట్టిస్తాం" అని ప్రభుత్వం చెబుతోంది. దీనిలో భాగంగానే తాజాగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పారిశ్రామిక విధానం-4ను ప్రభుత్వం తీసుకొచ్చింది. ఈ నేపథ్యంలో బుధవారం జరిగిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో కృష్ణాజిల్లా మల్లవల్లి మోడల్ ఇండస్ట్రియల్ పార్కులో 349 మందికి భూములు కేటాయిస్తూ నిర్ణయం తీసుకున్నారు. అయితే ఈపార్క్ ఏర్పాటు చేసి ఏడున్నరేళ్లయినా అందులో మౌలిక వసతుల సమస్యలు అపరిష్కృతంగానే ఉంది. అందవల్లే బాలారిష్టాలను అధిగమించి పార్కులో ఏ మేరకు పారిశ్రామిక పురోగతి, ఉపాధి కల్పన జరుగుతుందనేది ప్రశ్నార్ధకంగానే ఉంది.

పారిశ్రామిక ప్రగతి నత్తనడక !

ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక మౌలిక వసతుల కల్పన సంస్థ (ఎపిఐఐసి) ఆధ్వర్యంలో 2016లో కృష్ణాజిల్లా మల్లవల్లిలో సుమారు 1,260 ఎకరాల్లో మోడల్ ఇండస్ట్రియల్ పార్కును ఏర్పాటు చేశారు. లే అవుట్ తర్వాత దానిని 765.92 ఎకరాలను 938 ప్లాట్లుగా విభజించారు. దీనిలో అత్యధికంగా మోహన్‌స్పిన్‌టెక్, అశోక్‌లేలాండ్ బాడీ బిల్డింగ్ యూనిట్లకు 125 ఎకరాల భూములు కేటాయించారు. 75 ఎకరాల్లో నిర్మించిన అశోక్ లేలాండ్ బాడీ బిల్డింగ్ యూనిట్లో ఇప్పటికీ ఉత్పత్తి ప్రారంభం కాలేదు. ఈ యూనిట్ ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా 2 వేల మందికిపైగా ఉపాధి దొరుకుతుందని ప్రభుత్వం ప్రచారం చేసింది. అయితే ఆరేళ్లుగా అక్కడ ఏర్పాటు చేసిన కంపెనీల్లో ఉత్పత్తులు ప్రారంభించకపోవడంతో ఎవరికీ ఉపాధి దొరకలేదు. దీంతో గడువులోగా పార్క్‌లో పరిశ్రమలు ఏర్పాటు చేయని 350 మంది నుంచి గత ప్రభుత్వం భూములను తిరిగి

స్వాధీనం చేసుకుంది. అయితే ప్రభుత్వం తాజాగా 349 మందికి భూములు కేటాయించింది.

అసంపూర్తిగా మౌలిక వసతులు

అనుసంధాన, కొన్ని అంతర్గత రహదారులు, డ్రైన్లు, విద్యుత్ వంటి మౌలిక వసతులను పార్కులో ఏర్పాటు చేశారు. అయితే అవసరమైన నీటిని అందుబాటులోకి తీసుకురాలేదు. కృష్ణానది నుంచి నేరుగా పైప్‌లైన్ ద్వారా నీరందించాలనే ప్రతిపాదన అమలుకు నోచుకోలేదు.

ఖాళీగా 300 ఎకరాలు

ఎపిఐఐసి పార్కు భూముల కేటాయింపులో ఒక్కోసారి ఒక్కో ధరను నిర్ణయిస్తున్నారు. అశోక్ లేలాండ్, మోహన్ స్పిన్‌టెక్స్, హెరిటేజ్‌తోపాటు మరికొన్ని సంస్థలకు ఎకరం రూ.16.50 లక్షలకు ప్రభుత్వం కేటాయించింది. ఆ తర్వాత ఈ భూముల ధరలను 28 లక్షలకు పెంచారు. పారిశ్రామిక మౌలిక వసతులు కల్పనకు భారీగా ప్రభుత్వ వ్యయం అయిందని చెబుతూ వైసిపి ప్రభుత్వ హయాంలో రూ.78 లక్షలకు పెంచారు. గతంలో వివిధ సందర్భాల్లో కేటాయించిన భూములు పోను ఈ ఇండస్ట్రియల్ పార్కులో 300 ఎకరాల భూమి ఉంది. తాజాగా కేటాయించిన భూములకు ఎంత ధరను నిర్ణయించారన్నది తెలియాల్సి ఉంది.

పోటాపోటీగా మద్యం షాపులు

- ఇటు ప్రైవేటు వ్యక్తులు...అటు సిండికేట్ వ్యాపారులు...
- మందు బాబులకు చుక్కెదురు
- పాత ధరలకే మద్యం విక్రయాలు
- బెల్ట్ షాపులకు బేరాలు
- ఒక్కోషాపు రూ.10 వేలు

ప్రజాశక్తి - గన్నవరం, పెడన : కృష్ణాజిల్లా గన్నవరం ప్రాంతంలో మద్యం షాపుల టెండర్ల నుండి మొదలైన బెదిరింపులు ఇప్పుడు షాపుల ఏర్పాటు వరకూ కొనసాగుతోంది. "మద్యం షాపులు పొందిన ప్రైవేటు వ్యక్తులు సిండికేట్లోకి వస్తారా ? లేదంటే షాపులో 50 శాతం వాటా ఇస్తారా ? తేల్చుకోండి.. కాదంటే మీ షాపు పక్కనే మా షాపు పెడతాం.. మీకంటే తక్కువ ధరలకు అమ్మేస్తాం.. మిమ్మల్ని నష్టాల్లోకి నెట్టేస్తాం" అంటూ అధికార పార్టీ టిడిపికి చెందిన సిండికేట్ బెదిరింపులకు దిగుతోంది. సిండికేట్ బెదిరింపులకు లొంగకుండా షాపులు పెట్టేందుకు కొందరు ప్రైవేటు మద్యం దుకాణదారుల ముందుకు వెళ్లడంతో ఆ షాపులకు కొద్ది దూరంలోనే టిడిపికి చెందిన ఆ సిండికేట్‌కు చెందిన షాపులు ఏర్పాటు చేస్తున్నారు. ముఖ్యంగా గన్నవరం మండలం విఎన్ పురం వెళ్లే రోడ్లో పాత షాపు నడిచింది. వ్యాపారం కూడా బాగానే ఉంటోంది. ప్రైవేటు మద్యం టెండర్ పొందిన వ్యక్తి ఆ షాపులోనే వైన్‌షాప్ పెట్టేందుకు ఏర్పాటు చేస్తున్నాడు. దీంతో సిండికేట్లోని వారు ఆ షాపుకు ఎదురుగా తమ మద్యం షాపు పెడుతున్నారు. అలాగే దావాజీగూడెంలో ప్రైవేటు వ్యక్తి పాత షాప్‌లోనే తన షాపు పెట్టేందుకు సిద్ధమయ్యాడు. దీంతో సిండికేట్‌కు చెందిన వారు దానికి కొద్ది దూరంలో తమ షాప్ పెట్టేస్తున్నారు. ప్రైవేటు షాపుల వ్యాపారాన్ని దెబ్బతీయడానికి ఈరకంగా ప్లాన్ చేస్తున్నారని అంటున్నారు. అలాగే మాజీ ఎంఎల్ఎ వల్లభనేని వంశీ నివాసం ఉంటున్న అపార్ట్మెంట్ ఎదురుగా ఒక షాపును ఏర్పాటు చేస్తున్నారు. అదేవిధంగా కేసరపల్లిలో రెండు షాపులు, తెంపల్లి వెళ్లే రోడ్లో రెండు షాపులు, ముస్తాబాద ప్రాంతంలో రెండు షాపులు పోటాపోటీగా ఏర్పాటు చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. సిండికేట్‌తో సంబంధం లేకుండా ప్రైవేట్ వ్యక్తులు టెండర్లు వేసి లాటరీ ద్వారా షాపులు దక్కించుకుని వాటిని ఏర్పాటు చేస్తుండగా, వారికి పోటీగా అధికార పార్టీకి చెందిన సిండికేట్ వారు కూడా షాపులను పెట్టేందుకు ప్రయత్నిస్తుండడంతో వారి మధ్య పోటీ ఏవిధంగా ఉంటుందో వేచిచూడాల్సి ఉంది. ఇరువైపుల వారు మద్యం వ్యాపారం ద్వారా సొమ్ము చేసుకోవడానికి ఎత్తుకు పైఎత్తులు వేస్తున్నారు. భవిష్యత్తులో గొడవలు జరిగినా ఆశ్చర్యపడాల్సిన అవసరం లేదని స్థానికులు అంటున్నారు. మరోవైపు షాపుల ఏర్పాట్లలో నిబంధనలు పాటించడం లేదనే విమర్శలు వస్తున్నాయి.

రూ.10 వేలతో బెల్ట్ షాపునకు అనుమతి

నియోజకవర్గ వ్యాప్తంగా ఎంతో అట్టహాసంగా ప్రారంభమైన మద్యం షాపులు మందు

(మిగతా 2లో)

గన్నవరం - విఎన్ పురం రోడ్లో పాత షాప్‌లోనే ఏర్పాటు చేస్తున్న కొత్త షాపు

కొత్తషాపునకు ఎదురుగా ఏర్పాటు చేస్తున్న సిండికేట్‌దారుల షాపు

నివాసాల మధ్య వద్దని నిరసన

నివాసాల సమీపంలో మద్యం షాపు వద్దంటూ ఎన్‌టిఆర్ జిల్లా మైలవరం మండలం వెల్వడం గ్రామ మహిళలు బుధవారం ఆందోళనకు దిగారు. వెల్వడం - చిన్న నందిగామ రహదారిలో ప్రైవేటు మద్యం షాపు ఏర్పాటు చేస్తున్నట్లు తెలుసుకున్న సమీప నివాసాల్లోని మహిళలు అక్కడకు చేరుకొని నివాసాల మధ్య మద్యం షాపు వద్దంటూ నినాదాలు చేస్తూ నిరసనకు దిగారు. అలాగే నివాసాల మధ్య మద్యం షాపులకు పెట్టనీయొద్దని డిమాండ్ చేస్తూ సిపిఎం ఆధ్వర్యాన విస్సన్నపేట తహశీల్దార్‌కు, తిరువూరు ఎక్సైజ్ ఎస్ఐకు వినతిపత్రాలు అందజేశారు. ప్రధానంగా విస్సన్నపేట అంబేద్కర్ సర్కిల్‌లో మద్యం దుకాణాల ఏర్పాటుకు అనుమతి ఇవ్వొద్దని డిమాండ్ చేశారు. మరోవైపు ప్రైవేటు మద్యం పోటాపోటీగా ఏర్పాటవుతున్నాయి. ఇటు ప్రైవేటు వ్యక్తులు, అటు సిండికేట్

వ్యాపారులు దుకాణాలను ఏర్పాటు చేయడం ప్రజలను ఆందోళనకు గురిచేస్తోంది. కొత్తగా ఏర్పాటు చేస్తున్న దుకాణాల్లో పాత ధరలకే మద్యం విక్రయాలు చేస్తుండడంతో మందు బాబులకు చుక్కెదురైంది. అలాగే షాపుల నిర్వాహకులు బెల్ట్ షాపులకు బేరాలు ప్రారంభించారు. ఒక్కో బెల్ట్ షాపునకు రూ.10 వేల వరకూ వసూలు చేస్తున్నారు.

అమరావతి డ్రోన్ సమ్మిట్‌కు విస్తృత బందోబస్తు

ఎన్‌టిఆర్ జిల్లా పోలీసు కమిషనర్ రాజ శేఖర బాబు

ప్రజాశక్తి - విజయవాడ : ఈనెల 22, 23 తేదీల్లో కష్ణమ్మ ఒడ్డున డ్రోన్‌షోతోపాటు సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతున్న నేపధ్యంలో పున్నమిఘాట్, బబ్బురి గ్రౌండ్స్, భవానీఘాట్ పరిసర ప్రాంతాలను బుధవారం విజయవాడ పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజ శేఖర బాబు పరిశీలించారు. ఇతర అధికారులతో కలిసి పున్నమిఘాట్ పరిసర ప్రాంతాలను పరిశీలించి వీఐపీ గ్యాలరీ, పబ్లిక్ గ్యాలరీ.. ఇలా వివిధ గ్యాలరీల వద్ద ఎటువంటి అవాంచనీయ సంఘటనలు జరుగకుండా తీసుకోవాల్సిన భద్రతా ఏర్పాట్లపై సమీక్షించారు. వీటితోపాటు డెలిగేట్స్, వివిఐపిలు, సామాన్యులు ఈ కార్యక్రమాన్ని వీక్షించే క్రమం సవ్యంగా సాగేలా ఏర్పాటు చేసేందుకు పలు సూచనలు చేశారు. భద్రతా ఏర్పాట్లను అధికారుల వద్ద నుంచి సమాచారం అడిగి తెలుసుకున్నారు. వాహనాల పార్కింగ్ ఏర్పాట్లపై అన్ని శాఖల అధికారులతో సమన్వయం చేసుకుంటూ పటిష్ట బందోబస్త్ నిర్వహించాలని అధికారులకు, సిబ్బందికి సిపి సూచించారు. ఈకార్యక్రమంలో పలువురు డిసిపిలు ఎస్.ఉదయారాణి, కష్ణమూర్తి నాయుడు, ఎడిసిపిలు, ఎసిపిలు, ఇన్‌స్పెక్టర్లు, ఎస్ఐలు, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

ఏర్పాట్లను పరిశీలిస్తున్న సి.పి రాజశేఖర్‌బాబు

పోటాపోటీగా మద్యం షాపులు

(మొదటి పేజీ తరువాయి)

బాబులకు నిరాశనే కలిగిస్తున్నాయి. గత ప్రభుత్వ మద్యాన్ని బుధవారం నాడు పాత ధరలకే విక్రయించారు. దీంతో మందుబాబులు వెనుతిరిగారు. పెడన పట్టణంలో నాలుగు మద్యం షాపులు, రూరల్ ప్రాంతాల్లో రెండు షాపులకు అనుమతులు పొందగా, పట్టణంలో కేవలం మూడు షాపులకే మద్యం దిగుమతి అయ్యింది. అది కూడా అరకొరగానే ఉండడంతో కొనుగోలు దారులకు ఒకటి రెండు మద్యం బాటిళ్లు మాత్రమే విక్రయిస్తున్నారు. గత నాలుగు నెలలుగా టిడిపి కూటమి ప్రభుత్వం నాణ్యమైన మద్యాన్ని తక్కువ ధరలకే విక్రయిస్తామని ప్రచారం చేస్తూ, చివరకు పాత ధరలకే విక్రయాలు జరుపుతుండడంతోపాటు మందుబాబులకు తొలి రోజే నిరుత్సాహం ఎదురైంది. మందుబాబులు ఉదయం నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకు షాపుల వద్ద పడిగాపులు పడ్డారు. అయితే మద్యం షాపులు దక్కించుకున్న వారు మధ్యాహ్నం మూడు గంటల తర్వాతే విక్రయాలను చేపట్టారు. పెడనలో నాలుగు షాపులకుగాను మూడు షాపులకే మద్యం దిగుమతి కాగా, మరో షాపుకు గురువారం నుంచి సరఫరా కానున్నట్లు తెలిసింది. మరోవైపు కొత్త షాపులు ప్రారంభమవుతుండడంతో ఆయా షాపుల యజమానుల్లో అధికార పార్టీకి చెందిన ఒకరు ఇప్పటికే బెల్ట్ షాపులు నిర్వహించుకునేందుకు అనుమతి ఇప్పిస్తామంటూ ఒక్కొక్కరి వద్ద నుండి రూ.10 వేల చొప్పున వసూలు చేస్తున్నట్లు తెలిసింది. అధికార పార్టీకి చెందిన ఆ నాయకుడు ఏకంగా ప్రధాన రహదారిలోని ఓ షాపు వెనుక వైపు తన కార్యాలయాన్ని కూడా ఏర్పాటు చేసుకున్నాడు. పట్టణంతోపాటు పరిసర ప్రాంతాల్లో బెల్ట్ షాపులు నిర్వహించుకునేందుకు ఆ నాయకుడి వద్ద పలువురు తమ పేరు, చిరునామా నమోదు చేసుకుని రూ.10 వేలు చెల్లిస్తున్నారు. అనంతరం బెల్ట్ షాపుల నిర్వాహకుల పేరుతో రసీదులు పంపి మద్యం షాపు నుండి సరుకు సరఫరా చేసేందుకు ప్రణాళికలు రూపొందించుకున్నారు. కొత్త మద్యం షాపులకు సరుకు ఇంకా సరిగా సరఫరా జరగకముందే కార్యాలయాలు ప్రారంభించి బెల్ట్ షాపులకు అనుమతుల పేరుతో వేలాది రూపాయలు దండుకోవడంపై అధికారులు ఎలా స్పందిస్తారో వేచి చూడాల్సిందే. ఇదిలా ఉండగా పెడనలో మద్యం సరఫరా కానీ షాపుతో కలిపి ఐదు షాపులను నిర్వహిస్తుండడం కొసమెరుపు.

కాలుష్య రహిత లక్ష్య సాధనకు కృషి : విఎంసి కమిషనర్ ధ్యానచంద్ర

ప్రజాశక్తి-విజయవాడ : నగరంలో మెరుగైన పారిశుధ్య నిర్వహణకు, కాలుష్య రహిత నగరానికి ఆ రంగంలోని నిపుణులతో నగర కమిషనర్ ధ్యానచంద్ర విఎంసి ప్రధాన కార్యాలయంలో తన ఛాంబరల్లో బుధవారం సమావేశం నిర్వహించారు. వేస్ట్ వాటర్ ప్రాసెస్, పారిశుధ్య నిర్వహణ, నగరాభివద్ధిపై చర్చించారు. కాలుష్య రహిత సమాజానికి తీసుకోవాల్సిన చర్యలు, పారిశుధ్య నిర్వహణకు మెరుగైన వసతుల కల్పన తదితర అంశాలపై చర్చించారు. ఈ సమావేశంలో కాస్మిక్ హిలోర్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఢిల్లీ సభ్యులు, కేజీ ఎంపీ పార్ట్నర్స్ నిపుణులు, ఎస్ ఈ (ప్రాజెక్ట్స్) సత్య కుమారి, చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ ఇన్చార్జ్ డాక్టర్ సురేష్ బాబు, ఎకౌంట్స్ ఆఫీసర్ బి.సత్యనారాయణ పాల్గొన్నారు.

వీలునామా దస్తావేజు పోయినది

విజయవాడ కార్పోరేషన్ ఏరియాలో చేరిన పటమట, హైస్కూల్ రోడ్డు, తోట వారి వీధి, మంజూ రెసిడెన్సి బి-బ్లాక్, డోర్ నెంబర్ GF-6 కాపురస్థురాలు యలమంచిలి (లేటు) శివరావు గారి భార్య రాజ్యలక్ష్మి అను నేను తెలియజేయునది ఏమనగా నాకు పటమట పట్టణము నందు కొన్ని ఆస్తులు ఉన్నవి. మంజు రెసిడెన్సి అపార్ట్మెంట్ మరియు ఖాళీ ప్రదేశములు కలవు. సదరాస్తులకు సంబంధించి నా భర్త గారు నాకు ఒక అన్ రిజిస్టర్ వీలునామా రాసి ఉన్నారు. సదరు వీలునామా కాపీ జిరాక్స్ తీయించు నిమిత్తము 14.10.2024 తేదీన సాయంత్రం ఐదు గంటలకు పటమటలో సెంటర్ కు ద్విచక్ర వాహనంపై వెళ్ళి వీలునామా కాపీ జిరాక్స్ తీయించుకొని తిరిగి ఇంటికి వెళుతున్న సమయంలో సదరు వీలునామా దస్తావేజు జారిపోయినది. ఇంటికి వెళ్లి చూడగా వీలునామా దస్తావేజు ఒరిజినల్ కాపీ కనిపించలేదు. దానికోసం వెతికిననూ దొరకలేదు. అది ఎవరికైనా దొరికిన ఎడల ఈ క్రింది ఫోన్ నెంబర్ కు ఇవ్వగలరు.

ఇట్లు,
యలమంచిలి రాజ్యలక్ష్మి,
9640022259,

పబ్లిక్ నోటీసు

నా క్లయింటు ఇచ్చిన సంజాయిషీపై ఇందుమూలంగా యావన్మందికి తెలియజేయునది ఏమనగా, కృష్ణాజిల్లా, బాపులపాడు మండలం, వేలేరు గ్రామ నివాసి మహమ్మద్ ఇబ్రహీం గారి కుమారుడు బదీవుల్లా గారి వద్ద రీ.స. నెం. 423/1లో ఎ.0.80 శెంట్లు మాగాణి భూమి ఆస్తిని పరిశీలించి సంతృప్తి చెంది కొనుటకు ది. 07-08-2024వ తేదీన అగ్రిమెంటు చేసివున్నాడు. ఈ లావాదేవీలో ఎవరికైనా అభ్యంతరాలు, ఆక్షేపణలు వున్న యెడల ఈ రోజు నుండి 10 రోజులలోపు ఆర్.పి. ద్వారా రాత పూర్వకంగా ఈ క్రింది అడ్రస్‌కు తెలియజేయ వలెను. గడువు దాటిన తర్వాత వచ్చిన అభ్యంతరాలు, ఆక్షేపణలు పరిగణనలోనికి తీసుకొనబడవు.

షెడ్యూలు ఆస్తి

కృష్ణాజిల్లా, బాపులపాడు మండలం, వేలేరు గ్రామంలోని రీ.స.నెం. 423/1లో ఎ.0.80 సెంట్లు భూమి హద్దులు:
తూర్పు : రోడ్డు,
దక్షిణం : దోనవల్లి జయశ్రీనివాస్ గారి భూమి
పడమర : వేలేరు నుండి వీరవల్లి రోడ్డు
ఉత్తరొ : వేలేరు నుండి వీరవల్లి రోడ్డు

బెక్కం వెంకటేశ్వరరావు,
న్యాయవాది,
అప్పనవీడు గ్రామం, పెదపాడు మండలం,
ఏలూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్.
సెల్ నెం. : **984888 4227**
పిన్‌కోడ్ : **521105**

మహారాజశ్రీ నందిగామ సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) వారి కోర్టు
S.O.P.NO.3/2024

Between:
1. కొప్పు రాజేశ్వరి
2. నాళ్ళ మీరాబాయి
3. ఓరుగంటి @ కొప్పు విజయలక్ష్మి
4. ఓరుగంటి @ కొప్పు వాసవి

...పిటీషనర్లు

AND

\- NIL -

...రెస్పాడెంటు

పై నెంబరు కేసులోని పిటీషనర్సు, 1వ పిటీషనరు భర్త, 2 to 4 వారల తండ్రి అయిన కొప్పు అనంతవీరభద్రమూర్తి గారు ఫ్రాంక్లిన్ టెంపుల్‌టన్ అను మ్యూచ్‌వల్ ఫండ్ సంస్థలో చేసిన డిపాజిట్ సొమ్ము తాలుకు రూ.7,00,000/-లు నిమిత్తము, సదరు అనంత వీరభద్రమూర్తి గారు చనిపోయినందున, వారి వారసులుగా తమకే సదరు సొమ్ము చెందవలెననె కోరుచూ పిటీషనర్సు పై కోర్టు వారి ఎదుట పై నెంబరు సక్సెషన్ ఓపీని దాఖలు చేసినారు. కావున పైన తెలిపిన మ్యూచవల్ ఫండ్ సంస్థ నుండి వచ్చే పై నగదును పొందుటకు పిటీషనర్సు పేరున సక్సెషన్ సర్టిఫికెట్‌ను కోర్టు వారు జారీచేయుటకు ఎవరికైనా అభ్యంతరాలు ఉన్నయెడల ది 7.11.2024న ఉదయం గం.10-30 ని॥లకు పై కోర్టు వారి ఎదుట స్వయంగా కానీ, ప్లీడరు గారి ద్వారా కానీ హాజరు అయి మీ ఆక్షేపణలను తెలియజేసుకొనగలరని ఇందుమూలంగా యావన్మందికి తెలియజేయడమైనది. ఎట్టి అభ్యంతరాలు రాని యెడల కోర్టు వారు పిటీషనర్సు పేరు మీద సక్సెషన్ సర్టిఫికెట్ జారీ చేయబడునని తెలియజేయడమైనది.

ఇట్లు
ఇ.వి.జగనాన్నధరావు
జి.లక్ష్మీనారాయణ
పిటీషనర్సు తరపు అడ్వకేట్సు
(కోర్టు వారి ఉత్తర్వులతో)

నందిగామ,
16-10-2024

గ్రామీణులకు రక్షిత తాగునీరందించాలి

(మొదటి పేజీ తరువాయి)

మందిరంలో స్థాయి సంఘాల సమావేశాలు జరిగాయి. వివిధ ప్రభుత్వ శాఖలు, సంక్షేమాభివద్ధి కార్యక్రమాలపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈసమావేశంలో విద్య, వైద్యం, వ్యవసాయం, గ్రామీణాభివద్ధి, సాంఘిక సంక్షేమం, స్త్రీ సంక్షేమం, రక్షణ, ప్లానింగ్ ఆర్థికం, పెండింగ్ పనులపై సమీక్ష నిర్వహించారు. ఈక్రమంలో ఆయా అంశాలపై సభ్యులు పలు సమస్యలను లేవనెత్తగా సంబంధిత అధికారులు వివరణ ఇచ్చారు. ఈ సందర్భంగా జడ్పీ చైర్‌పర్సన్ హారిక మాట్లాడుతూ జిల్లాలో రక్షిత మంచినీటి పథకాలు అస్తవ్యస్తంగా తయారయ్యాయని, నీరు కలుషితం కాకుండా ఫిల్టర్ బెడ్లు, ఓవర్ హెడ్ ట్యాంకులు సక్రమంగా శుభ్రం చేసే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. చెరువుల్లో నాచు తొలగింపు, చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటుతోపాటు ట్యాప్ లు పాడైపోయిన కుళాయిలకు మరమ్మతులు చేపట్టాలని అధికారులకు సూచించారు. జల జీవన్ మిషన్ పథకం ద్వారా ఇంటింటికీ కుళాయి కనెక్షన్లు ఇచ్చేందుకు పెద్ద మొత్తంలో నీటి సరఫరా చేయాల్సిన అవసరం ఉందని, అందుకు నీటి నిల్వకు సరిపడా చెరువులు లేదా స్థలాలను గుర్తించి పనులను చేపట్టాలని అన్నారు. జిల్లాలో ఇప్పటివరకు మంజూరైన గహాలకు లబ్ధిదారులు వెంటనే నిర్మాణాలు చేపట్టే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ విషయంలో లబ్ధిదారులతో సమావేశాలు నిర్వహించి అవగాహన కల్పించి ప్రోత్సహించాలని, వచ్చే మార్చి కల్లా నిర్మాణాలను పూర్తి చేయాలని అన్నారు. ఈనేపథ్యంలో అవసరమైన లే అవుట్లలో మెరక పనులు, రహదారుల నిర్మాణం, విద్యుత్, నీటి వసతి, డ్రైనేజీ వంటి మౌలిక వసతులు కల్పించి నిర్మాణాలకు అనుకూలంగా పరిస్థితులను కల్పించాలని సూచించారు. వైద్య ఆరోగ్య శాఖ పై నిర్వహించిన సమీక్షా సమావేశంలో కష్ణాజిల్లా వైద్యాధికారిణి డాక్టర్ జి గీతాబాయి మాట్లాడుతూ క్యాన్సర్ స్క్రీనింగ్ సర్వేపై ఎంఎల్‌హెచ్‌పి లకు ఇప్పటికే శిక్షణ తరగతులు నిర్వహించామని, బెల్ కంపెనీ వారు దానం చేసిన కేన్సర్ స్క్రీనింగ్ పరికరాల సహాయంతో వచ్చే నెలలో గ్రామాలలో వైద్యపరీక్షలు నిర్వహించనున్నామని తెలిపారు. పారిశుధ్య కార్మికులకు మెడికల్ క్యాంపులు నిర్వహించి వారి ఆరోగ్య పరిరక్షణకు చర్యలు తీసుకున్నామని, అందుకు కష్ణా జిల్లాకు ఉత్తమ అవార్డు లభించిందని తెలిపారు. ఎన్టీఆర్ జిల్లా వైద్యాధికారిణి డాక్టర్ సుహాసిని మాట్లాడుతూ ఇటీవల కురిసిన వర్షాలు, సంభవించిన వరదలకు డ్రోన్లు, బోట్లు సహాయంతో అవసరమైన వారికి ఔషధాలను అందించామని, ఎలాంటి వ్యాధులు సంక్రమించకుండా సకాలంలో అవసరమైన చర్యలు తీసుకున్నామని వివరించారు. జిల్లా పరిషత్, మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ నిధులతో చేపట్టిన వివిధ అభివద్ధి పనులను సకాలంలో పూర్తి చేయాలని, మొదలుపెట్టని పనులను పురోగతిలోకి తీసుకురావాలని సూచించారు. ఈ సమావేశంలో జెడ్పి సీఈఓ కన్నమనాయుడు, డిప్యూటీ సీఈవో ఆనంద్ కుమార్, పలువురు జడ్పిటిసి సభ్యులు, కష్ణా, ఎన్టీఆర్, ఏలూరు జిల్లాల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

IN THE COURT OF THE CIVIL JUDGE (JUNIOR DIVISION), MOVVA
O.S. No. 123/2023

Between :
State Bank of India, Lakshmipuram, Rep by its Branch Manager, Lakshmipuram
..... Plaintiff

And

1) Banoth Vijaya
2) Vemula Krishna ..... Defendants

To,
D1 : Banoth Vijaya, W/o Nagarjuna, Hindu, aged about 32 years, Properties, R/o Padamara Veedhi, Challapalli Village, Challapalli Mandal, Krishna District.

పై నెంబరు దావాలో మొదటి ప్రతివాదికి దావా సమను నిమిత్తం చివరి సారిగా ది. 28-10-2024న వాయిదా దయచేసినారు. సదరు వాయిదారోజున ఉదయం 10-30 గం.లకు పై కోర్టునందు మీరు స్వయంగా గానీ లేదా మీ ప్లీడరు ద్వారా గానీ హాజరయి మీకు గల ఆక్షేపణలు తెలియపరచు కొనగలరు. లేనిచో శ్రీ కోర్టువారు మీ పరోక్షమున తీర్మానించెదరు.

(శ్రీ కోర్టువారి ఉత్తర్వుల ప్రకారం)

వాయిదాతేది: 28-10-2024
మొవ్వ
ది.3-10-2024

ఇట్లు
సనకా రఘురామప్రసాద్, బి.కాం., బి.ఎల్.,
న్యాయవాది, అవనిగడ్డ.
సెల్ నెం. **9949988835**

IN THE COURT OF THE CIVIL JUDGE (JUNIOR DIVISION), MOVVA
O.S. No. 29/2021

Between :
Indian Bank Challapalli Rep by its Branch Manager, Challapalli ..... Plaintiff

Vs

Indira Dwacra Group, Mangalapuram, rep by 1) Movva Sara Grase & 7 others
..... Defendants

To,
D3 : Kolluri Nagendramma , W/o Muniyya, Hindu, aged about 64 years, Properties
D4 : Kolluri Nagendram, W/o Koti Nagulu, Hindu, aged about 61 years, Properties
D6 : Chigurupalli Jhansi Rani, W/o Srinivasa Rao, Hindu, aged about 54 years, Properties

members of Indira Dwacra Group R/o Mangalapuram Village, Challapalli Mandal, Krishna district.

పై నెంబరు దావాలో ప్రతివాదులు అయిన 3వ, 4వ మరియు 6వ వారికి దావా సమను నిమిత్తం చివరిసారిగా ది. 22-10-2024 నాడు వాయిదా దయచేసినారు. సదరు వాయిదారోజున ఉదయం 10-30 గం.లకు పై కోర్టునందు మీరు స్వయంగా గానీ, లేదా మీ తరపు ప్లీడరుగారి ద్వారా గానీ హాజరై మీకు గల ఆక్షేపణలు ఏమైనా వుంటే తెలియపరచు కొనగలరు. లేనిచో మీ పరోక్షమున తీర్మానించెదరు.

(శ్రీ కోర్టువారి ఉత్తర్వుల ప్రకారం)

వాయిదాతేది: 22-10-2024
మొవ్వ
ది.3-10-2024

ఇట్లు
సనకా రఘురామప్రసాద్, బి.కాం., బి.ఎల్.,
న్యాయవాది, అవనిగడ్డ.
సెల్ నెం. **9949988835**

IN THE COURT OF THE HON'BLE XVI ADDITIONAL DISTRICT JUDGE KRISHNA DISTRICT: AT NANDIGAMA
G.W.O.P. No: 62/2024

Between:
Nagubandi Ramesh, S/o Janardhan, Aged about: 38 years, Occupation: Street Vendor, D No 1-258/2, Makandeya Bazaar, Jaggayyapet Krishna (Dist) A P

.... వాది

And

1. Sri. Tiruveedi Venkateswaralu,
S/o Late Ramaiaha, Aged about: 56 years, Do No: 9-144, Peerla Chavadi Back Side Bazar, Near Vysu Mutyalamma Temple, Huzur nagar, Suryapet (Dist) Telangana. Pin-508 204
2. Smt. Tiruveedi Annapurna,
W/o Sri. Tiruveedi Venkateswarallu Aged about: 52 years, Do No: 9-144, Peerla Chavadi Back Side Bazar, Near Vysu Mutyalamma Temple, Huzurnagar, Suryapet (Dist) Telangana. Pin-508 204
3. Sri Somesittey Lakshmi Bharati,
W/o Sri.Somesittey Venataravi Kumar, Aged about 31 years, Do No: 1-2-64, Kusuma Harijanawada, Opp Kolimi, Nawabpeta, VTC Nellore, Nellore (Dist) Andhra Pradesh. Pin-524 002
4. Sri.Somesittey Venata Ravi Kumar,
S/o Somesittey Seethaiaha, Aged about: 42 years, Do No: 1-2-64, Kusuma Harijanawada, Opp Kolimi, Nawabpeta, VTC Nellore, Nellore (Dist) Andhra Pradesh. Pin-524 002

.... ప్రతివాదులు

పై నెంబరు దావాలో వాది, ప్రతివాదులపై దావా దాఖలు చేసివున్నారు. సదరు దావాలో 1 టు 4 ప్రతివాదులైన మీరు మీ హాజరు నిమిత్తం ది. 18-10-2024వ తేదీ ఉదయం 10-30 గం.లకు కోర్టువారి ఎదుట మీరు కానీ, మీ న్యాయవాది ద్వారా కానీ హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకోగలరు. లేనిచో మీకు పరోక్షంగా కోర్టువారు తీర్మానించెదరు.

(శ్రీ కోర్టువారి ఉత్తర్వుల మేరకు)

నందిగామ
తేది: 16-10-2024

అన్నెపాగ ప్రపుల్ల శ్రీకాంత్
న్యాయవాది, జగ్గయ్యపేట.-521175
సెల్ నెం : **9494653470**

PRABHAS DEGREE COLLEGE
(Affiliated to Krishna University)
Kedareswarapet, Vijayawada-520003.
Ph : 0866-2537879, Cell : 7670941483
P.G. ADMISSIONS SPOT/MANAGEMENT QUOTA 2024-25
Applications are invited from the eligible candidates for Admissions into PG Courses in Spot and Category-B seats for 2024-25 in (1). M.Sc. Organic Chemistry (2) M.Sc. Micro Biology (3) M.Sc. Computer Science (4) M.Com (5) MHRM (6) M.A. -Social Work.
Conduct of Spot/Cat-B Admissions 23-10-2024 (10AM to 5 PM)
Attend with all original certificates
-SECRETARY & CORRESPONDENT

నివాసాల మధ్య మద్యం దుకాణం ఏర్పాటు

ప్రజాశక్తి-చల్లపల్లి: చల్లపల్లి బైపాస్ రోడ్డులోని సాగర్ థియేటర్‌కు సమీపంలో నివాస గృహాల మధ్య మద్యం షాపు ఏర్పాటు చేయడంతో ఆ ప్రాంత మహిళలు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ఇప్పటివరకు ప్రశాంత వాతావరణంలో జీవనం సాగిస్తున్నామని రేపటి నుండి ఎలాంటి పరిస్థితులను ఎదుర్కోవలసి వస్తుందోనని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నివాస గృహాల మధ్య మద్యం దుకాణం ఏర్పాటు చేయటంపై ఆ ప్రాంత మహిళలు అధికారులపై మండిపడుతున్నారు. నివాసాల మధ్య దుకాణాలు ఏర్పాటు చేస్తుంటే అధికారులు పట్టించుకోరా అంటూ ప్రశ్నిస్తున్నారు. నివాసాల మధ్య మద్యం దుకాణాలు ఏర్పాటు చేయరాదని కొన్ని

ప్రాంతాలలో మహిళల ఆందోళన చేస్తూ అధికారులకు వినతిపత్రం అందిస్తున్నా మద్యం వ్యాపారుల తీరులో మార్పు రాలేదని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బైపాస్ రోడ్‌లో ప్రశాంతంగా ఉండే నివాసాల మధ్య మద్యం దుకాణం ఏర్పాటు చేయటంపై పలువురు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజా ప్రతినిధులు ప్రజల ఇబ్బందులను గమనించి నివాస గృహాల మధ్య మద్యం షాపులను ఏర్పాటు చేయకుండా తగు చర్యలు తీసుకోవాలని ప్రజలకు, మహిళలకు ఎలాంటి అసౌకర్యాలు లేకుండా చర్య తీసుకోవాలని కోరుతున్నారు. బైపాస్ రోడ్‌లో ఏర్పాటుచేసిన మద్యం దుకాణం ప్రధాన రహదారి నిత్యం రాకపోకలతో రద్దీగా ఉంటుంది. దీనిపై అధికారులు స్పందించాలని కోరుతున్నారు.

కేసరపల్లిలో వైన్ షాప్ ప్రారంభం

ప్రజాశక్తి-గన్నవరం: గన్నవరం మండలం కేసరపల్లి గ్రామంలో ఏఎంసీ మాజీ చైర్మన్ పొట్లూరి బసవరావు ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన విజయలక్ష్మి వైన్స్ షాపును బుధవారం సీనియర్ న్యాయవాది కలపాల వెంకటరమణ ప్రారంభించారు. ఉదయం నుంచి వైన్ షాపు మూసి ఉండటంతో మందుబాబులు ఒక్కసారిగా మందు కొనుగోలు చేసేందుకు ఎగబడ్డారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు జాస్తి వెంకటేశ్వరరావు, నాయకులు రాజులపాటి శ్రీనివాసరావు, మరీదు రాంబాబు, ఎంపీటీసీ సొంటి కిషోర్, ప్రముఖ బిల్డర్ రాజు, జాస్తి చిన్ని తదితరులు పాల్గొన్నారు.

క్షిపణి కేంద్రానికి అనుమతి పట్ల హర్షం

ప్రజాశక్తి-అవనిగడ్డ: నాగాయలంక మండలం

గుల్లలమోద వద్ద క్షిపణి పరీక్షా కేంద్రానికి అనుమతి సాధించడం పట్ల టిడిపి నేత ఎన్నారై బొబ్బా గోవర్ధన్ హర్షం వ్యక్తం చేశారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ క్షిపణి పరీక్షా కేంద్రం రాకతో అవనిగడ్డ నియోజకవర్గంలో ఉపాధి ఉద్యోగ అవకాశాలు మెరుగవుతాయని తెలిపారు. ఈ ప్రాంత అభివృద్ధికి కేంద్రం ఎంతగానో ఉపకరిస్తుందన్నారు 2014లో చంద్రబాబు హయాంలో ఈ కేంద్రానికి భూములు కేటాయించారని తిరిగి ఆయన అధికారంలోకి రావడంతోనే ఆగిపోయిన పనులన్నీ మళ్లీ ప్రారంభించనున్నారని తెలిపారు.

సమస్యలు పరిష్కరించాలని మున్సిపల్ కార్మికుల ధర్నా

ప్రజాశక్తి-కంకిపాడు: తాడిగడప మున్సిపాలిటీలో పని చేస్తున్న కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మున్సిపల్ కార్యాలయం వద్ద సిఐటియు ఆధ్వర్యంలో బుధవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పెనమలూరు మండలం సిఐటియు కార్యదర్శి ఉప్పాడ త్రిమూర్తులు మాట్లాడుతూ తాడిగడప మున్సిపాలిటీలో సుమారు 400 మంది కార్మికులు పనిచేస్తున్నారని తెలిపారు. వీరికి 2023 డిసెంబర్ నెలలో సమ్మె కాలం జీతాలు, జనవరి నెలలో సంక్రాంతి పండుగ బోనస్ రూ.వెయ్యి, ఫిబ్రవరి నెలలో హెల్త్ టెలివిన్స్ రూ.6 వేలు కార్మికులకు నేటికీ ఇవ్వలేదని, వెంటనే వాటిని కార్మికులకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ధర్నా వద్దకు ఎమ్మెల్యే బోడే ప్రసాద్ వచ్చి కార్మిక నాయకులతో మాట్లాడారు. జిల్లాలోని అన్ని మున్సిపాలిటీల్లో చెల్లిస్తే తాడిగడపలో ఇంకా ఎందుకు

చెల్లించాలేదని అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని కార్మికులకు హామీనిచ్చారు. ఈ కార్యక్రమంలో మస్తాన్‌వలి, వై.సరళ, మధిర ఏడుకొండలు, విజయ, సాంబశివరావు పాల్గొన్నారు.

కార్మికుని కుటుంబానికి సిఐటియు ఆర్థిక సాయం

ప్రజాశక్తి-గుడివాడ : గుడివాడ ఆటోనగర్లో పెయింటర్‌గా పనిచేస్తూ లారీకి పెయింట్ వేసే క్రమంలో ప్రమాదానికి గురైన ఎండి ఇద్రీస్‌ను ది కృష్ణాజిల్లా ఇండస్ట్రియల్ అండ్ ఆటోమొబైల్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) గుడివాడ ఆటోనగర్ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం పరామర్శించారు. ఈ సందర్భంగా కార్మికుని కుటుంబానికి రూ.10 వేలు ఆర్థిక సహాయం అందించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షులు అబ్దుల్ అమీద్ అలియాస్ అమీర్, ప్రధాన కార్యదర్శి అబ్దుల్ కుద్దుస్, సిఐటియు పట్టణ కార్యదర్శి టి.లక్ష్మణరావు, నాయకులు బొబ్బరపల్లి ఆంజనేయులు, ఎండి రషీద్ బేగ్, ఎస్కే కాజా, ఎస్కే రహమాన్, త్రినాథ్‌రెడ్డి నాగరాజు, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

పొంగుతున్న డ్రైయిన్లు... నీటమునుగుతున్న పంటలు

ప్రజాశక్తి-కోడూరు: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు డ్రైనేజీలు పొంగిపొర్లి పంట పొలాలు ముంపునకు గురవుతున్నాయి. కోడూరు మండల పరిధిలోని హంసలదీవి, పాలకాయతిప్ప, దింటిమేరక గ్రామాల సమీపంలోని వరినాట్లు నారుమడులో నీట మునుగుతున్నాయి. పాలకాయతిప్ప, కోడూరు అవుట్ పాల్స్ స్లూయిస్‌లకు గేట్లు లేని కారణంగా సముద్రపు పోట్లకు ఉప్పునీరు ఎగువకు వచ్చి పంట పొలాలను ముంచేస్తుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే రెండుసార్లు నారుమడులు పోశామని మరలా ఇప్పుడు ముంపునకు గురవుతున్నాయని ఈ విషయంపై స్థానిక అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి తగు చర్యలు చేపట్టాలని రైతులు, కౌలు రైతులు కోరుతున్నారు.

సిఎన్‌జి గ్యాస్ కొరతను పరిష్కరించాలి : సిఐటియు

ప్రజాశక్తి-మచిలీపట్నం రూరల్: మచిలీపట్నంలో సిఎన్‌జి గ్యాస్ సమస్యను పరిష్కరించి, 500 ఆటో కార్మికుల కుటుంబాలను ఆదుకోవాలని సిఐటియు జిల్లా కోశాధికారి బూర సుబ్రహ్మణ్యం డిమాండ్ చేశారు. మచిలీపట్నంలో సిఎన్‌జి గ్యాస్ కొరతను వెంటనే పరిష్కరించాలని కోరుతూ మచిలీపట్నం తహాశీల్దార్ కార్యాలయం వద్ద సిఎన్‌జి గ్యాస్ ఆటో వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో బుధవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు మండల కార్యదర్శి సిహెచ్.జయరావు మాట్లాడుతూ మచిలీపట్నంలో గత 15 రోజుల నుండి గ్యాస్ దొరక్క ఆటో కార్మికులు అనేక ఇబ్బందులు పడుతున్నారని, పెడన, పామర్రు, గుడివాడ వెళ్లి గ్యాస్ ఫిల్ చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. దీని వల్ల సమయం, ఆర్థికంగా నష్టపోతున్నారని, మచిలీపట్నంలో ఉన్న సిఎన్‌జి బంకును వెంటనే పునరుద్ధరణ చేసి 24 గంటలూ అందుబాటులో ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఈ కార్యక్రమంలో యూనియన్ కన్వీనర్ కరీముల్లా, షేక్ బాజీ, బాలు, రాజేష్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం తహసీల్దార్ జి.మధుసూదనరావుకు వినతిపత్రం అందజేశారు.

బైక్ దొంగ అరెస్ట్

ప్రజాశక్తి-గన్నవరం: హనుమాన్ జంక్షన్ సర్కిల్లో బైకుల దొంగతనాలకు పాల్పడుతున్న ఓ దొంగను అరెస్టు చేసి బైకులు రికవరీ చేసినట్లు వీరవల్లి ఎస్సై శ్రీనివాసరావు తెలిపారు.

బుధవారం పోలీస్‌స్టేషన్లో జరిగిన సమావేశంలో ఎస్ఐ మాట్లాడుతూ డిఎస్పి చలసాని శ్రీనివాసరావు ఆదేశాలతో హనుమాన్ జంక్షన్ సిఐ సత్యనారాయణ పర్యవేక్షణలో బుధవారం ఉదయం 11 గంటల సమయంలో తిప్పనగుంట గ్రామంలో బస్‌స్టాప్ వద్ద, గతంలో అనేక చోట్ల మోటార్ సైకిల్ నేరాలు పాల్పడిన పొట్రు సాయిశేఖర్‌ను పట్టుకున్నట్లు చెప్పారు. అతని వద్ద నుంచి వీరవల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో దొంగలించిన రెండు బైకులను, విజయవాడ సత్యనారాయణపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో దొంగలించిన ఒక బైకు, ఏలూరు, మంగళగిరి పరిసర ప్రాంతాల్లో దొంగలించిన రెండు బైకులు మొత్తం ఐదు బైకులును స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. నిందితుడిని అరెస్ట్ చేసి నూజివీడు కోర్టు ముందు హాజరుపరచగా 14 రోజులు రిమాండ్ విధించినట్లు తెలిపారు.

అక్రమ మద్యం స్వాధీనం

ప్రజాశక్తి-గన్నవరం: దొంగ చాటుగా మద్యం అమ్ముతున్న ఇరువురిని వేరు వేరు దాడుల్లో అదుపులో తీసుకుని వారి వద్ద నుండి 49 క్వార్టర్ బాటిల్ స్వాధీనం చేసుకుని

కేసు నమోదు చేసినట్లు ఎస్సై చావా సురేష్ బుధవారం తెలిపారు. ఆత్కూరు గ్రామానికి చెందిన తాండూరు ప్రసాద్, పాతంపాటి నాగబాబులు ఇరువురు అక్రమంగా మద్యం తెచ్చి అమ్ముతున్నారనే సమాచారంపై వారిద్దరిని అదుపులో తీసుకుని సోదాలు చేయగా పాతపాటి నాగేంద్ర కుమార్ వద్ద 30 లిక్కర్ బాటిళ్లు, తొంద్రు ప్రసాద్ వద్ద 19 క్వార్టర్ బాటిళ్లు స్వాధీనం చేసుకుని కకేసు నమోదు చేసినట్లు తెలిపారు.

హెడ్ కానిస్టేబుల్ మృతికి సంతాపం

ప్రజాశక్తి-కంకిపాడు

కంకిపాడు పోలీస్‌స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న సింగవరపు బుజ్జిబాబు (54) బుధవారం మృతిచెందారు. 2004 బ్యాచ్‌కి చెందిన బుజ్జిబాబు అనారోగ్యంతో విజయవాడలోని ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరణించారు. బుజ్జిబాబు స్వగ్రామం కౌతరం. బుజ్జిబాబు మృతి పట్ల సీఐ మురళీకృష్ణ, ఎస్ఐ డి.సందీప్ సంతాపం తెలిపారు.

ఎంఎల్‌సి ఓటర్ల నమోదు ప్రారంభం

ప్రజాశక్తి-అవనిగడ్డ: అవనిగడ్డ యుటిఎఫ్ ప్రాంతీయ కార్యాలయంలో గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటర్ల నమోదు సేవా కేంద్రాన్ని ఆ సంఘం జిల్లా అధ్యక్షులు బి కనకారావు బుధవారం ప్రారంభించారు. అవనిగడ్డ ప్రాంతీయ కార్యాలయము నందు ఆఫ్ లైన్, ఆన్లైన్ ఓటు నమోదు చేసుకొనుటకు అవకాశం కల్పించారు. 2021 నాటికి డిగ్రీ పూర్తి చేసిన వారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. నవంబర్ ఆరో తేదీ లోపు ఓటర్ నమోదు ప్రక్రియ ముగిస్తుందని తెలిపారు. గ్రాడ్యుయేట్స్ అందరూ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో అవనిగడ్డ కోడూరు మండల శాఖ అధ్యక్ష కార్యదర్శులు కూనపరెడ్డి జీవేంద్రరావు, కొండవీటి అశోక్, మోపిదేవి మండల ప్రధాన కార్యదర్శి ఎన్ఎన్ స్వామి, అవనిగడ్డ గౌరవాధ్యక్షులు పివి ఆంజనేయులు, జిల్లా కౌన్సిలర్ కె.రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

దుర్గమ్మ హుండీ ఆదాయం రూ.3.50 కోట్లు

ప్రజాశక్తి - వన్‌టౌన్ : శ్రీ దుర్గామల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం, ఇంద్రకీలాద్రి మహామండపం 6వ అంతస్తులో బుధవారం హుండీల లెక్కింపు కార్యక్రమం జరిగింది. 15 రోజులకు సంబంధించి నగదు రూ.3,50,28,700లు, బంగారం : 272 గ్రాములు, వెండి : 9 కేజీల 325 గ్రాములు భక్తులు హుండీ ద్వారా సమర్పించుకున్నారు. విదేశీ కరెన్సీ: యుఎస్ఏ - 285 డాలర్లు, యుఏఇ - 20 దిర్హమ్స్, ఒమాన్ - 0.5 రియల్స్ 100 బైసా, మలేషియా - 2 రింగెట్లు, ఇంగ్లాండ్ - 20 పౌండ్లు, కెనడా - 50 డాలర్లు, కువైట్ - 5 దినార్లు, సౌదీ - 15 రియాల్స్, ఇంగ్లాండ్ - 15 పౌండ్లు, ఆస్ట్రేలియా - 160 డాలర్లు, సింగపూర్ - 6 డాలర్లు సమర్పించారు. ఈనెల 17వ తేదీ గురువారం కూడా హుండీ లెక్కింపు కొనసాగుతుందని ఆలయ అధికారులు తెలిపారు. ఈరోజు హుండీ లెక్కింపులో ఆలయ ఇఒ కె.ఎస్.రామారావు, డిప్యూటీ ఇఒ రత్న రాజు, దేవాదాయ శాఖ అధికారులు, ఎఇఒలు, ఆలయ సిబ్బంది, ఎస్‌పిఎఫ్, వన్‌టౌన్ పోలీసు సిబ్బంది, అమ్మవారి సేవా దారులు హుండీ లెక్కింపు కార్యక్రమంలో పాల్గొన్నారు.

సమన్వయంతో పని చేస్తేనే గ్రామాభివృద్ధి

ప్రజాశక్తి - వీరులపాడు : అధికారులు ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేస్తేనే గ్రామాల అభివృద్ధి సాధ్యమని ఎంపిపి కోటేరు లక్ష్మి అన్నారు. బుధవారం జల్లి ఏసోబు కళ్యాణ మండపంలో మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. అధికారులు గ్రామ సర్పంచులు ఎంపిటిసి సభ్యులకు తెలియకుండా గ్రామంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద సిసి రోడ్ల శంకుస్థాపన చేయటం సరైన పద్ధతి కాదని పేర్కొన్నారు. ఎంపిడిఒ అరుంధతి దేవి మాట్లాడుతూ అధికారులు గ్రామాల్లో జరిగే అభివృద్ధి కార్యక్రమాల్లో తప్పనిసరిగా గ్రామ సర్పంచులు, ఎంపిటిసి సభ్యులకు సమాచారాన్ని తెలియపరచాలని సూచించారు. గతంలో పనిచేసిన బుక్ కీపర్లను (విఒఎ)లను యధావిధిగా విధుల్లోకి తీసుకోవాలని, అంతేకాకుండా హైకోర్టు ఆదేశాలున్నప్పటికీ వారిని విధులకు ఎందుకు తీసుకోవడం లేదని సభ్యులు ఎపిఎం యెహోషువాను నిలదీశారు. మండల పరిధిలో 22 గ్రామపంచాయతీల్లో రూ.29.50 లక్షలతో 25 బోర్లను మండల పరిషత్ నిధులతో ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. గ్రామాల్లో మౌలిక వసతులు కల్పనకు (డ్రైనేజీ, కల్వర్టులు) ఎంపిటిసి సభ్యులకు ఒక్కొక్కరికి రూ.రెండు లక్షలు మంజూరు చేసినట్లు తెలిపారు. ఈ సమావేశంలో అనంతరం పలు తీర్మానాలను సభ్యులు ఆమోదం తెలిపారు. గతంలో పనిచేసిన బుక్ కీపర్లను (విఒఎ)లను యధావిధిగా విధుల్లోకి తీసుకోవాలని తీర్మానించారు. మండల పరిధిలో 25 బోర్లను మండల పరిషత్ నిధులతో ఏర్పాటుకు ఆమోదం తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపి షేక్ నాగుల్ మీర, వేమురి ఆదాం, గ్రామ సర్పంచులు రమావత్ కోటి, పత్తిపాటి మల్లికార్జునరావు, సంద్ర సౌజన్య, మల్లెల శ్రీనివాసరావు, ఎంపిటిసి సభ్యులు, శీలం రమణారెడ్డి, మొండ్ర బాయమ్మ, తోట నారాయణరావు యాదాల సుజాత, తమ్మిశెట్టి వరలక్ష్మి, వేమిరెడ్డి కోటేశ్వరి, బండి సీతా మహాలక్ష్మి తహశీల్దార్ హుస్సేన్ వైద్యులు దీపిక గౌతమ్ విద్యాశాఖ అధికారి పాలు కెనడి, పంచాయతీ కార్యదర్శులు పలు శాఖల అధికారులు ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎంపిపి కోటేరు లక్ష్మి

వరద బాధితులకు నష్టపరిహారమివ్వాలి : సిపిఎం

ప్రజాశక్తి - భవానీపురం : బుడమేరు వరదలు వచ్చి ఇప్పటికే 46 రోజులవుతున్న ప్రభుత్వం నుంచి ఇంతవరకూ ఆర్థిక సాయం ఇవ్వకపోవడం బాధాకరమని సిపిఎం ఫ్లోర్ లీడర్, 50వ డివిజన్ కార్పొరేటర్ బోయి సత్యబాబు తెలిపారు. ఈ నేపథ్యంలో సిపిఎం పశ్చిమ బృందం ఆధ్వర్యంలో బుధవారం జక్కంపూడి వైఎస్ఆర్ కాలనీలో సిపిఎం బృందం వరద బాధితులను కలవడం జరిగింది. ఈ సందర్భంగా బోయి సత్యబాబు నష్టపరిహారాలు అందక ఎదురుచూస్తున్న బాధితులను పరామర్శించి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం వరద బాధితులకు నష్టపరిహారాలు ఇవ్వకుండా ప్రచార ఆర్భాటం చేయటం సరికాదన్నారు. ఇసుక బ్లాక్ మార్కెట్‌పై ఉన్న శ్రద్ధ వరద బాధితులు ఆదుకోవడంలో చూపాలన్నారు. బ్రాందీ షాపులు దందాలో ఉన్న శ్రద్ధ నష్టపరిహారాలు ఇచ్చే దాంట్లో చూపకపోవటం విడ్డూరమన్నారు. దాతల సహాయం బాధితులకి అందించాలని బోయి సత్యబాబు డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం నుండి ప్రత్యేక నిధులు రాబట్టేందుకు ప్రశ్నించాలని, గుక్కెడ నీరు కోసం ఎదురుచూస్తున్న కాలనీవాసుల ఇబ్బందులు తొలగించాలని కోరారు. ఒక బ్లాక్ 32 కుటుంబాలకి గానూ 25 కుటుంబాలకు సాయం అందలేదన్నారు. ఉపాధి లేక వరద సాయం అందగా పెన్షన్లు రాక పస్తులుంటున్నామని ఒంటరి మహిళలు వాపోతున్నారు. వరద బాధితులను మోసగించడం తగదని, వెంటనే కాలనీలో ఉన్న బాధితులందరికీ వరద నష్టపరిహారాలు వెంటనే చెల్లించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు, కార్పొరేషన్ ఫ్లోర్‌లీడర్ బోయి సత్యబాబు డిమాండ్ చేశారు. లేదంటే రానున్న రోజుల్లో బాధితులకు అండగా సిపిఎం ప్రజా ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కాలనీ నాయకులు దేవరకొండ వీరయ్య, పోలిపల్లి బంగార్రాజు, శంకర్, సూరిబాబు, చలమయ్య తదితరులు పాల్గొన్నారు.

వైఎస్ఆర్ కాలనీలో బాధిత మహిళలతో మాట్లాడుతున్న కార్పొరేటర్ బోయి సత్యబాబు

మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - మైలవరం : మృతుడు ఎర్రగుంట చిన్న శేషగిరిరావు కుటుంబానికి మైలవరం నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షులు లంక లితీష్ ఆర్థిక సాయం అందజేశారు. మైలవరం దేవుని చెరువులో నివాసం ఉంటున్న ఎర్రగుంట చిన్న శేషగిరిరావు మంగళవారం మృతిచెందగా బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ.5 వేలు అందజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు దూరు బాలకృష్ణ, వేముల అంకరాజు, బి.వెంకటరావు, తెలుగు యువత నాయకులు పాల్గొన్నారు.

సమాన పనికి సమాన వేతనం చెల్లించాలి

ప్రజాశక్తి - వన్‌టౌన్ : దేశంలోనే విజయవాడను స్వచ్ఛ నగరంగా తీర్చిదిద్దిన మున్సిపల్ కార్మికులకు కనీస వేతనం అమలు చేయాలని ఎఐటియుసి అధ్యక్ష, కార్యదర్శులు కె.ఆర్.ఆంజనేయులు, మూలి సాంబశివరావు, సిపిఐ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు డిమాండ్ చేశారు. ఈ నెల 24న చేపట్టిన నగర మహాసభను జయప్రదం చేయాలని సిపిఐ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు బుధవారం పిలుపునిచ్చారు. 51, 52వ డివిజన్ల శానిటరీ కార్యాలయాల వద్ద బుధవారం జరిగిన కార్నర్ మీటింగ్‌లో ఎఐటియుసి అధ్యక్ష, కార్యదర్శులు కె.ఆర్.ఆంజనేయులు, మూలి సాంబశివరావు, నగర నాయకులు బుద్దె రాజా, సింగరాజు సాంబశివరావు, మున్సిపల్ ఎంప్లాయిస్ నాయకులు జెక్కి జేమ్స్, తుపాకుల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర యాజమాన్యం సర్టిఫికెట్ కోర్సుపై శిక్షణ

ప్రజాశక్తి - జగ్గయ్యపేట: మండలంలోని గారికపాడు డాక్టర్ కె.ఎల్.రావు విజ్ఞాన కేంద్రంలో బుధవారం వివిధ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ప్రతినిధులకు సమగ్ర యాజమాన్యం సర్టిఫికెట్ కోర్సు శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థ ప్రోగ్రాం కోఆర్డినేటర్ 16 నుంచి 30 వరకు జరుగుతుందని ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ కె.అచ్యుత్ రాజు తెలిపారు. ఈ కోర్సు ప్రారంభోత్సవంలో కోర్స్ అధ్యక్షుడు డాక్టర్ పి.శివ ప్రసాద్ మాట్లాడుతూ ఈ కోర్స్ ఆవశ్యకత గురించి వివరించడం జరిగింది. వ్యవసాయ పరిశోధన స్థానం, గరికపాడు, ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఎస్.కృష్ణంరాజు సేంద్రీయ వ్యవసాయ ప్రాముఖ్యత గురించి వివరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాల గరికపాడు ప్రిన్సిపాల్ డాక్టర్ బి.వెంకటేశ్వర్లు, భవాని దేవి అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న శివ ప్రసాద్

దేశాభివృద్ధికి బాటలు వేసిన రతన్‌టాటా

ప్రజాశక్తి - వన్‌టౌన్ : ప్రముఖ పారిశ్రామికవేత్త భారతరత్న రతన్‌టాటా భారతదేశ అభ్యున్నతికి బాటలు వేశారని ఎస్‌కెపివివి హిందూ హైస్కూల్స్ కమిటీ విద్యాసంస్థల అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ డాక్టర్ వి.నారాయణరావు అన్నారు. కాకరపర్తి భావనారాయణ పిజి కళాశాల కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్ స్టడీస్ ఆధ్వర్యంలో రతన్‌టాటా విజయాలు - దేశాభ్యున్నతి అంశంపై పోస్టర్ ప్రెజంటేషన్, ఫొటో ఎగ్జిబిషన్‌ను బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యక్రమాన్ని ప్రారంభించిన డాక్టర్ వి.నారాయణరావు మాట్లాడుతూ రతన్‌టాటా పారిశ్రామికవేత్తగా జీవితాన్ని ప్రారంభించినా ప్రపంచంలోనే గొప్ప మానవతావాదిగా ప్రజల మనస్సుల్లో నిలిచిపోయారన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ జి.కృష్ణవేణి మాట్లాడుతూ రతన్‌టాటా ఆర్జించిన ఆదాయంలో అత్యధిక శాతం సమాజానికి వినియోగించి ప్రజల మనస్సుల్లో సుస్థిరమైన స్థానాన్ని సంపాదించారన్నారు. ఆయన జీవితాన్ని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.వెంకటేశ్వరరావు, పీజీ డైరెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేష్, అధ్యాపకులు రవికిరణ్, వీ శైలజ తదితరులు పాల్గొన్నారు.

ఫొటో ఎగ్జిబిషన్‌ను పరిశీలిస్తున్న వి. నారాయణరావు

'ఆ స్థలం ఆక్రమణ అవాస్తవం'

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : ఎస్ఆర్ఆర్ అండ్ సివిఆర్ ప్రభుత్వ కళాశాల 6 ఎకరాల స్థలం ఆక్రమణకు గురవ్వడం అవాస్తవమని, ఆ స్థలం తమకు సంబంధించిందేనని స్థల యజమానురాలు పెద్దల వెంకట శివమ్మ స్పష్టం చేశారు. అసలు అక్కడ వున్న భూమి 3 ఎకరాల 15 సెంట్ల మాత్రమే నని ఆ భూమిపై సర్వహక్కులు తమవేనని తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వివరాలను తెలిపారు. ఆమె మాట్లాడుతూ 3 ఎకరాల 15 సెంట్ల భూమి తమదని చెప్పారు. వెంకట శివమ్మ అనే తనకు ఎకరం 62 సెంట్లు ఉన్నాయని, ఎస్ఆర్ఆర్ సివిఆర్ కళాశాలకు ఈ స్థలానికి ఎటువంటి సంబంధం లేదన్నారు. రికార్డ్స్ లేకుండా వచ్చి తమ భూమిని కొంతమంది అడ్డుకుంటున్నారని, ఆరు ఎకరాలు భూమి ఇక్కడ లేదని స్పష్టం చేశారు. తమ భూమిని తాము చదును చేసుకుంటే కావాలనే అడ్డుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విలేకరుల సమావేశంలో పెద్దల శివరామ ప్రసాద్, మైనేని దుర్గారాణి, చదలవాడ విజయలక్ష్మి, మహాలక్ష్మి కో ఆపరేటివ్ బిల్డింగ్ సొసైటీ అధ్యక్షులు కొండలరావు, కార్యదర్శి రాజారామ్ తదితరులు పాల్గొన్నారు.

వివరాలు తెలుపుతున్న స్థల యజమానురాలు శివమ్మ

నిరుద్యోగులకు 'రాంకో' శిక్షణ

ప్రజాశక్తి - జగ్గయ్యపేట: మండలంలోని జయంతిపురం గ్రామంలో రామ్ కో సిమెంట్స్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ప్రెసిడెంట్ మాన్యుఫాక్చరింగ్ ఆశిష్ కుమార్ శ్రీవాస్తవ మాట్లాడుతూ రామ్ కో సోషల్ సర్వీస్‌లో భాగంగా బూదవాడ గ్రామానికి చెందిన 10 మంది (భూక్యా మహేష్, గుగులోతు నాగరాజు, కొత్తపల్లి ముత్తయ్య, యమర్తి కొండల్ రావు, గడ్డం ఏసుబాబు, మలవతు వినోద్, ముద్దవతు చందు, ముదవతు సాయి రామ్, గడ్డం అన్వేష్, గడ్డం కొండ) పదోవ తరగతి, ఇంటర్, ఐటిఐ పూర్తి చేసిన నిరుద్యోగ యువకులకు హైదరాబాద్‌లోని జి.ఎం.ఆర్ నైపుణ్య శిక్షణ సంస్థ సహకారంతో మూడు నెలల వృత్తి నైపుణ్య శిక్షణ ఇప్పించి, వారికి హైదరాబాద్‌లోని ప్రముఖ సంస్థలైన లుగంగో, హ్యుందాయ్, లియో ఎక్విప్మెంట్ లో మొదటి ఆరు నెలకు రూ.12,500 నుంచి 16 వేలు వరకు జీతం వస్తుందనీ తరువాత వారి ప్రతిభ ఆధారంగా ఆ సంస్థలోని ఫుల్ టైమ్ చేసి జీతం 16,000 రూపాయల నుంచి 22,000 రూపాయల వరకు ఉంటుందని తెలిపారు. శిక్షణ సమయంలో 10 మందికి నెలకు 5000 రూపాయల చొప్పున మూడు నెలలకు భృతి, అదనంగా రవాణా ఖర్చులను రాంకో సంస్థ తరపున కల్పించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాం కో సిమెంట్స్ సీనియర్ జి.ఎం అకౌంట్స్, అడ్మిన్ ఫరూక్ మొహమ్మద్, జి.ఎం- మైన్స్ జానీ రెడ్డి, సీనియర్ డిజిఎం మానవ వనరుల విభాగం ఎం.రామకృష్ణ సాయి, విజయవాడ పార్లమెంటు తెలుగు రైతు ప్రధాన కార్యదర్శి గడ్డం హుస్సేన్, రాంకో సిమెంట్స్ ప్రతినిధులు పాల్గొన్నారు.

అధ్వానంగా చల్లపల్లి-నడకుదురు రోడ్డు

ప్రజాశక్తి-చల్లపల్లి: భారీ లోడు వాహనాల రాకపోకలతో చల్లపల్లి నుండి నడకుదురు వెళ్లే రోడ్డు అధ్వానంగా మారింది. గోతులు పడి ప్రమాదకరంగా మారింది. రోడ్డు అంచులు కోతకు గురికావడంతో ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి. గత సంవత్సరం ఆర్టీసీ బస్సు బోల్తా, చెరకులోడుతో వెళ్తున్న ట్రాక్టర్లు, చెరుకు బండ్లు బోల్తా పడిన సంఘటనలు ఉన్నాయి. అవనిగడ్డ విజయవాడ కరకట్ట పక్కనే నదీ పరివాహక ప్రాంతం నుండి నిత్యం భారీ లోడుతో టిప్పర్లు రాకపోకలు సాగించడం వల్లనే రహదారి ధ్వంసం అయిందని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. చల్లపల్లి మండల కేంద్రంగా ఉండటం వలన గ్రామాల నుండి కార్యాలయాలకు, వివిధ పనుల మీద చల్లపల్లికి వచ్చే ద్విచక్ర వాహనదారులు, ఆటో ప్రయాణికులు ప్రమాదాలు గురవుతున్నారు. చల్లపల్లి విద్యా కేంద్రంగా ఉండటంతో కళాశాలకు వచ్చే బస్సులు, సైకిళ్లు, ద్విచక్ర వాహనాలపై ప్రయాణించే విద్యార్థిని విద్యార్థులు ప్రమాదాలను ఎదుర్కొంటున్నారు. రహదారి ధ్వంసం అయినా భారీ వాహనాలకు అడ్డుకట్ట వేయకపోవడంతో రోడ్డంతా పాడైపోయి గోతుల మయంగా మారింది. గత సంవత్సరం వైసీపీ ప్రభుత్వం లక్షలాది రూపాయలు ఖర్చుపెట్టి వేసిన రహదారి ధ్వంసం కావటంపై పలు అనుమానాలను ప్రజలు వ్యక్తపరుస్తున్నారు. రోడ్డు మధ్యలో ఎత్తు పల్లాలు ఏర్పడటం వలన తరచుగా వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. భారీ వాహనాల తాకిడికి రోడ్డు లేచిపోయి గోతులు ఏర్పడ్డాయి. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు గోతులు పెద్దవిగా మారి ప్రాణాంతకంగా తయారయ్యాయి. రాత్రి సమయాలలో ప్రయాణికులను తీసుకెళుతున్న ఆటోలు, ద్విచక్ర వాహన చోదకులు సైకిళ్లపై వెళ్తున్న విద్యార్థిని విద్యార్థులు ఆ గోతులలో పడి ఆసుపత్రుల పాలవుతున్నారు. అవనిగడ్డ నుండి విజయవాడ వెళ్లే కరకట్ట బస్సులు ఇదే రహదారిలో రాకపోకలు సాగిస్తున్నాయి. నిత్యం రద్దీగా ఉండే ఈ రోడ్డు వెంట ఆర్టీసీ బస్సులో ప్రయాణం ఇబ్బందికరంగా మారింది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఈ రోడ్డు నిర్మాణం చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

అన్నదానం ప్రారంభం

ప్రజాశక్తి-గుడివాడ

యాత్రికులకు, దీక్షాదారులకు అయ్యప్ప దేవస్థానం ఉచితంగా అన్నదానం చేస్తునట్లు దేవస్థానం వైస్ చైర్మన్ శిష్టా దత్తత్రేయులు అన్నారు. బుధవారం స్థానిక ఏలూరురోడ్డులోని టెలిఫోన్ నగర్‌లోని స్వామి అయ్యప్ప స్వామి వారి దేవస్థానంలో అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. దేవస్థానం ఆధ్వర్యంలో మాలధారులకు భోజనాలు, రాత్రి సమయంలో టిఫిన్‌లను డిసెంబర్ 2వ తేదీ వరకు అందజేస్తునట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు వడ్డాది రాజేష్, లాయర్ రజనీ పాల్గొన్నారు.

20న ఉచిత మెగా వైద్య శిబిరం

ప్రజాశక్తి-గన్నవరం: గన్నవరం మండలం సూరంపల్లి గ్రామపంచాయతీ కార్యాలయంలో ఈ నెల 20వ తేదీన ఎంజె నాయుడు సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ సౌజన్యంతో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ఆసుపత్రి ప్రతినిధి శర్మ తెలిపారు. ఈ వైద్య శిబిరంలో బిపి, షుగర్, ఆర్థో, బ్రెయిన్, థైరాయిడ్, గుండె వంటి సంబంధిత రోగాలను పరీక్షించి అవసరమైన వారికి మందులు పంపిణీ చేస్తారని, నిపుణులైన వైద్యులు హాజరవుతారని తెలిపారు. ఉదయం పది నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు వైద్య శిబిరం కొనసాగుతుందని, సూరంపల్లి పరిసర గ్రామాల్లోని రోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గ్రామ సర్పంచ్ శ్రీనివాసరావు వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తారన్నారు.

గుడివాడ ఏరియా అసుపత్రి తనిఖీ

ప్రజాశక్తి-గుడివాడ: ప్రజల ఆరోగ్య సంరక్షణ కోసం ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. బుధవారం స్థానిక ప్రభుత్వ ఏరియా అసుపత్రిని ఎమ్మెల్యే తనీఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా రోగులకు అందించే భోజనాలను పరిశీలించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ రోగులకు అందించే అహారం సక్రమంగా లేకపోతే చర్యలు తీసుకుంటమన్నారు. ప్రజల మంచి కోసం ప్రభుత్వం నిరంతరం కషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ యలవర్తి శ్రీనివాసరావు, టిడిపి నాయకులు చేకూరు జగన్‌మోహన్‌రావు, పండ్రాజు సాంబయ్య, సయ్యద్ జబీన్,

హాస్పటల్ సూపరిండెంట్ ఇందిరాదేవి, హాస్పిటల్ వైద్య అధికారులు పాల్గొన్నారు.

గుంటూరు అర్బన్ బ్యాంకు ప్రారంభం

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా): అర్బన్ బ్యాంకు సేవలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర గనులు భూగర్భవనరులు ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. బుధవారం నగరంలోని జిల్లా పరిషత్ సెంటర్లో నూతనంగా ఏర్పాటు చేసిన గుంటూరు అర్బన్ కో-ఆపరేటివ్ బ్యాంకు ను మంత్రివర్యులు ప్రారంభించారు.ఈ సందర్భంగా మంత్రి లాకర్లు డిపాజిట్లు రుణాల విభాగాలను క్యాష్ కౌంటర్లను పరిశీలించారు. అనంతరం వినియోగదారులకు తనదైన శైలిలో మెరుగైన సేవలు అందించి మంచి గుర్తింపు తెచ్చుకోవాలని మంత్రివర్యులు బ్యాంక్ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఏపీఎస్ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ళ నారాయణరావు, బ్యాంకు చైర్మన్ బోనబోయిన శ్రీనివాస యాదవ్, వైస్ చైర్మన్ ఎం బసివి రెడ్డి, డైరెక్టర్లు కే రామారావు, ఎస్ కే సైదా, ఆర్ భాస్కరరావు, సీఈవో ఎం. సంజీవరావు, డిప్యూటీ సీఈవో కే.అప్పారావు, అసిస్టెంట్ మేనేజర్ వై. నాగార్జున, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గొర్రెపాటి గోపీచంద్, స్థానిక ప్రముఖులు బండి రామకృష్ణ, బండ్రెడ్డి రాము తదితరులు పాల్గొన్నారు.

నేడు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ప్రారంభం

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు: మండలంలోని కవుతరం గ్రామంలో సబ్ రిజిస్టర్ కార్యాలయం, ప్రాథమిక వ్యవసాయ సహకార కేంద్ర బ్యాంక్ ఆధ్వర్యంలో కవుతరం చెక్ పోస్ట్ సెంటర్ వద్ద ఏర్పాటు చేసిన పెట్రోల్ బంకును ఈ నెల 17వ తేదీ గురువారం రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు ప్రారంభించనున్నట్లు టిడిపి నాయకులు ఎం.సుబ్రహ్మణ్యం తెలిపారు. రిజిస్టర్ ఆఫీస్ సొంత భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో గత కొన్నేళ్లుగా అద్దె భవనంలో కార్యకలాపాలు కొనసాగిస్తున్నారు. ఇటీవల సొంత భవనం పునర్నిర్మాణం కావడంతో దాన్ని కూడా ప్రారంభించనున్నారు. పెట్రోల్ బంక్ నిర్మాణానికి రూ.50 లక్షలు హెచ్‌పిసిఎల్, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం తరపున రూ.20 లక్షలు వెచ్చించినట్లు తెలిపారు.

అప్పుల ఊబిలో పంచాయతీ కార్మికులు

ప్రజాశక్తి-గన్నవరం: గ్రామ పంచాయతీల్లో పారిశుధ్య పనులు చేస్తున్న కార్మికులకు ఆకలి కేకలు తప్పడం లేదు. మూడు నెలలుగా వేతనాలు ఇవ్వకపోవడంతో అప్పులతో కాలం గడుపుతున్నారు. ప్రభుత్వాలు మారినా తమకు కష్టాలు తప్పడం లేదని అంటున్నారు. నెలల తరబడి వేతనాలు రాకపోవడంతో చిల్లర దుకాణాల్లో అప్పులు పెరిగిపోయి వాటిని తీర్చడానికి నూటికి ఐదు రూపాయలకు అప్పులు చేస్తున్నారు. ఎప్పటికైనా ప్రభుత్వం కనికరించి కార్మికులను పర్మినెంట్ చేయకపోతుందా అన్న ఆశతో ముందుకు సాగుతున్నారు. గన్నవరం మండలంలో 21 పంచాయతీలున్నాయి. వాటిలో పారిశుధ్య, నీటి సరఫరా, కరెంట్ రిపేర్లకు మొత్తం 200 మంది పనులు చేస్తున్నారు. కాంట్రాక్టు పద్ధతిలో నెలకు రూ.6 వేలు వేతనం ఇచ్చేలా ఒప్పందం కుదుర్చారు. నెల వారిగా వేతనాల బిల్లు పెట్టి పంచాయతీ కార్యదర్శులు నిధులు డ్రా చేసి వారికి ఇవ్వాలి. ఇంత వరకు బాగానే ఉన్నా.. వేతనాలు మూడు నుంచి ఐదు నెలలకోసారి వస్తుండటంతో కార్మికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఒక్కో కార్మికుడికి సగటు ఐదు నెలలకు రూ.30 నుంచి రూ.40 వేలు రావాలి. మూడు నెలలకు రూ.18 వేలు దాకా ఇవ్వాల్సి ఉంది. పంచాయతీల్లో నిధులున్నా ఇవ్వడం లేదనే వాదనుంది. ప్రభుత్వం కొత్త విధానం పెట్టడంతో డబ్బులు డ్రా చేయడం పెద్ద సమస్యగా మారిందని అంటున్నారు. ప్రత్యేక అధికారుల పాలనలో అన్నీ అవస్థలే అన్న మాట వినిపిస్తోంది.

ఆహ్వాన కమిటీ ఏర్పాటు

ప్రజాశక్తి-చల్లపల్లి: డిసెంబర్ 1, 2, 3 తేదీల్లో చల్లపల్లిలో జరిగే సిపిఎం కృష్ణాజిల్లా మహాసభలకు ఆహ్వాన కమిటీ ఏర్పాటైనట్లు చల్లపల్లి మండల కార్యదర్శి యద్దనపూడి మధు తెలిపారు. స్థానిక గుంటూరు బాపనయ్య శ్రామిక భవనంలో బుధవారం ఆయన మాట్లాడుతూ చల్లపల్లిలో జరిగే జిల్లా మహాసభలకు స్థానిక ప్రముఖ వైద్యుడు డాక్టర్ డిఆర్‌కె ప్రసాద్ అధ్యక్షుడిగా, యద్దనపూడి మధు కార్యదర్శిగా, కోశాధికారిగా మహమ్మద్ కరీముల్లా, ఉపాధ్యక్షులుగా చేబ్రోలు బసవపూర్ణ, మేడంకి వెంకటేశ్వరరావు, గొరిపర్తి శ్రీనివాసరావు, వాకా రామచంద్రరావు, శీలం నారాయణరావు, బండి ఆదిశేషు, పోలా బత్తిన మోహన్‌రావు, ఆవుల బసవయ్యలను ఎన్నుకున్నట్లు తెలిపారు.

నేడు వాల్మీకి జయంతి

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా): జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమం, సాధికారిత శాఖ ఆధ్వర్యంలో గురువారం మహర్షి వాల్మీకి జయంతి కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమం, సాధికారిత అధికారి బి.రమేష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డికె బాలాజీ పాల్గోనున్నారని, కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

డిఎస్‌సి ఉచిత శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానం

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా): రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ ఉత్తర్వుల మేరకు ఎస్సి, ఎస్టి అభ్యర్థులకు ఉచిత డిఎస్సి శిక్షణ అందించడం జరుగుతుందని, ఆసక్తి గల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చని జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి షాహిద్ బాబు షేక్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇందుకు https://jnanabhumi.ap.gov.in వెబ్‌సైట్ ద్వారా ఈ నెల 21లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ నెల 27న నిర్వహించే స్క్రీనింగ్ పరీక్షలో మెరిట్ అభ్యర్థులను అర్హత ప్రకారం ఉచిత శిక్షణకు ఎంపిక చేయడం జరుగుతుందన్నారు.

రేపు డిఇఓ కార్యాలయం ముందు ధర్నా

ప్రజాశక్తి-గుడివాడ : మచిలీపట్నం డిఇఓ కార్యాలయం ఎదుట ఈ నెల 18వ తేదీన యుటిఎఫ్ కృష్ణాజిల్లా శాఖ ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమం నిర్వహించనున్నట్లు జిల్లా గౌరవాధ్యక్షులు నీలం ప్రభాకర్‌రావు తెలిపారు. గుడివాడ యుటిఎఫ్ కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మున్సిపల్ ఉపాధ్యాయుల సమస్యలు, డీఈవో కార్యాలయంలో అపరిష్కృత సమస్యలపై నిర్వహించనున్న ధర్నాను విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో సతీష్ కుమార్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

తాగునీటి సమస్యను పరిష్కరించాలి

ప్రజాశక్తి-గుడివాడ: పల్లె పండుగ కార్యక్రమం రోజున పంచాయతీరాజ్ శాఖ మంత్రి, ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్‌ను గుడివాడ నియోజకవర్గం మూడు మండలాల్లోని 43 గ్రామాల్లో తాగునీటి సమస్య ఉందని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము కోరడంతో నీటి సమస్యను వెంటనే పరిష్కరించాలని అధికారులను అదేశించడం గొప్ప విషయమని జనసేన ఇన్‌చార్జి బూరగడ్డ శ్రీకాంత్ అన్నారు. బుధవారం స్థానిక జనసేన కార్యాలయంలో విలేకర్లుతో మాట్లాడుతూ ఇప్పటి వరకు అనేక ప్రభుత్వాలు వచ్చినప్పటికి సమస్యను అప్పటికప్పుడు పరిష్కరించే దిశగా ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చర్యలు తీసుకోవడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మజ్జి శ్రీనివాసరావు, సుంకర వెంకట్, గుండు వెంకటరావు, గునుకులు వినోద్, వెంకటేష్, నరేష్, పవన్ తదితరులు పాల్గొన్నారు.

విజయకుమారికి సత్కారం

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు: భవిత కేంద్రంలో దాదాపు 18 సంవత్సరాలుగా ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు ఐఇఆర్‌టిగా విశిష్ట సేవలందించిన విజయకుమారిని బుధవారం సత్కరించారు. ఇటీవల ఆమె మండవల్లి జడ్‌పిహెచ్ స్కూల్ అసిస్టెంట్ (స్పెషల్ ఎడ్యుకేషన్)గా ఎంపికైన సందర్భంగా మండల విద్యాశాఖాధికారి కార్యాలయంలో బుధవారం వీడ్కోలు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ-1, 2 జి.జగన్మోహనరావు, జి.గోపాలరావు, సిబ్బంది విజయకుమారిని సత్కరించారు.

నివాసాల మధ్య మద్యం షాపులొద్దు

ప్రజల నుండి పలుచోట్ల వ్యతిరేకత

ప్రజాశక్తి - మైలవరం : నివాసాల సమీపంలో మద్యం షాపు వద్దంటూ మహిళలు ఆందోళనకు దిగారు. మండలానికి 4 మద్యం షాపులను కేటాయించారు. లాటరీ పద్ధతిలో దక్కించుకున్న కొంతమంది బుధవారం ఉదయం వెల్వడం నుండి చిన్న నందిగామ వెళ్లే రహదారి లో ప్రైవేటు మద్యం షాపును నిర్వాహకులు ఏర్పాటు చేస్తున్నారు. విషయం తెలుసుకున్న సమీప నివాసాల్లోని మహిళలు అక్కడకు చేరుకొని నివాసాల మధ్య మద్యం షాపు వద్దంటూ నినాదాలు చేస్తూ ఆందోళనకు దిగారు. గతంలో ఇదే ప్రదేశంలో మద్యం షాపు ఉండటం వల్ల కొంతమంది నివాసాల్లోకి వచ్చి ఆడవారిని దుర్భాషలు ఆడారని, దొంగతనాలు కూడా జరిగాయని అప్పటి ఎంఎల్‌ఎ దృష్టికి తీసుకెళ్లగా తొలగించారని అన్నారు. ఊరికి దూరంగా ఏర్పాటు చేసుకుంటే తమకు అభ్యంతరం లేదని ఇంటి వద్ద ఎవరూ లేని సమయంలో చిన్న పిల్లలను ఇబ్బంది పెడుతూ, వృద్ధులపై గొడవకు దిగుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి నివాసాల మధ్య మద్యం షాపులు లేకుండా చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు. **విస్సన్నపేట :** నివాస ప్రాంతాలకు దూరంగా మద్యం దుకాణాలను ఏర్పాటు చేసుకోవాలని సిపిఎం మండల కమిటీ ఆధ్వర్యంలో తహశీల్దార్ లక్ష్మీ కళ్యాణికి, తిరువూరు ఎక్సైజ్ శాఖ ఎస్ఐ సివి.కుమార్‌కి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి విస్సంపల్లి నాగరాజు అధికారులతో మాట్లాడుతూ నివాస ప్రాంతాలకు, పాఠశాలలకు కళాశాలలకు, దేవాలయాలకు ప్రజలు నిత్యం రద్దీగా ఉండే ప్రాంతాలకు దూరంగా మద్యం దుకాణాలు ఏర్పాటు చేసుకోవాలని కోరారు. ప్రధానంగా విస్సన్నపేట అంబేద్కర్ సర్కిల్‌లో మద్యం దుకాణాలకు ఏర్పాటు చేయటానికి అనుమతులు ఇవ్వకూడదన్నారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో సిపిఎం పట్టణ కార్యదర్శి మేకల జ్ఞాన రత్నం మండల కమిటీ సభ్యులు గద్దల రామకృష్ణ అఖిలభారత ప్రజాతంత్ర మహిళా సంఘం విస్సన్నపేట మండల కార్యదర్శి కరెడ్ల ధనలక్ష్మి పాల్గొన్నారు.

మైలవరం మండలం వెల్వడం గ్రామంలో మద్యం షాపులు వద్దంటూ వ్యతిరేకిస్తున్న గ్రామస్తులు

విస్సన్నపేటలో తహశీల్దార్‌కు వినతి ఇస్తూ...

షాపుల నిర్వహణకు సిద్ధం

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన మద్యం పాలసీ విధానంలో భాగంగా నూతన వైన్‌షాపులకు అనుమతి కోసం ఇబ్రహీంపట్నం మండలంలో మూడు షాపులకు కొండపల్లి మున్సిపాలిటీ పరిధిలో రెండు షాపులకు అనుమతి ఇవ్వగా, కొండపల్లి మున్సిపాలిటీ పరిధిలో సుమారుగా 143 అప్లికేషన్ రాగా, మండల స్థాయిలో 100కు పైగా అప్లికేషన్లు వచ్చాయి. ఇందులో లాటరీ ప్రకారం కొండపల్లి మున్సిపాలిటీకి సంబంధించిన రెండు షాపులు పొన్నం శ్రీనివాసరావు, షేక్ నాగుల్ మీరాకు అనుమతి లభించింది. ఇబ్రహీంపట్నం పరిధిలో ఎన్.లిఖిత జవ్వాది వినయ్ ఎన్.సాంబశివరావుకు అనుమతులు లభించాయి. కొండపల్లి మున్సిపాలిటీ పరిధిలోని రెండు షాపులు కొండపల్లిలో వ్యాపారం ఎక్కువగా ఉంటుందనే ఉద్దేశంతో స్థానిక ఎపి హెచ్‌ఎంఎల్ కంపెనీ సమీపంలో జాతీయ రహదారి పక్కన ఏర్పాటు చేయనున్నట్టు సమాచారం. నిబంధనలకు విరుద్ధంగా రెండు షాపులు ఒకే చోట వ్యాపారం ప్రారంభించనున్నాయి. ఒకే చోట ఉన్న ఎవరి వ్యాపారం వారిది అన్న రీతిలో నడిపేందుకు రెండు షాపు యజమానులు సిద్ధమయ్యారు.

సిసి రోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న ఎంఎల్ఎ, తదితరులు

గ్రామాల్లో 'పల్లెపండుగ'

ప్రజాశక్తి - తిరువూరు : ప్రభుత్వం అట్టహాసంగా ప్రారంభించిన పల్లె పండుగ వారోత్సావాలను ఎమ్మెల్యే కోలికపూడి శ్రీనివాసరావు బుధవారం తిరువూరు మండలంలోని వివిధ గ్రామాల్లో విస్తృతంగా నిర్వహించారు. కోకిలంపాడు, మల్లెల, లక్ష్మీపురం, కాకర్ల, అంజనేయపురం గ్రామాల్లో సిసి రోడ్లకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం బాటలు వేస్తుందన్నారు. దానిలో భాగంగా ముందుగా ప్రతి గ్రామంలో సిసి రోడ్ల నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. టిడిపి నేతలు వెదురు వెంకట నర్సిరెడ్డి, కోమటి వెంకట రామారావు, గడిపర్తి హనుమంతరావు, బొద్దుకోళ్ల ప్రేమరాజు, గొలమందల శ్రీనివాసరావు, సుంకర కృష్ణ మోహన్‌రావు, ఆంజనేయ పురం సర్పంచ్ ఎం.కుటుంబరావు, మల్లెల సర్పంచ్ వంగూరు మరియమ్మ ఎంపిడిఒ నాగేశ్వరావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

నేత్ర పరీక్షలు చేస్తున్న దృశ్యం

విశ్రాంత ఉద్యోగులకు నేత్ర పరీక్షలు

ప్రజాశక్తి - తిరువూరు : తిరువూరు తహశీల్దార్ కార్యాలయ ఆవరణలోని బాపూజీ పెన్షన్ హోంలో విశ్రాంత ఉద్యోగులకు ఉచిత నేత్ర వైద్య శిబిరం బుధవారం నిర్వహించారు. రిటైర్ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వైద్య శిబిరంలో విజయవాడ మ్యాక్స్ విజన్ ఆసుపత్రి వైద్యులు వందమందికి నేత్ర పరీక్షలు చేసి అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. శాస్త్ర చికిత్స అవసరం ఉన్న వారిని గుర్తించి విజయవాడ రిఫర్ చేశారు. ఈ కార్యక్రమంలో రిటైర్డు ఉద్యోగుల సంఘ అధ్యక్షుడు బల్లిపర ప్రసాదరావు, సంఘ కార్యవర్గ సభ్యులు ఇవి శేషారావు, మార్క్, మోదుగు ప్రసాదు, అయినాల వెంకటేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న శ్రీనివాసరావు, పక్కన రవీంద్రరెడ్డి

క్షతగాత్రుడికి సాయం

ప్రజాశక్తి - రెడ్డిగూడెం : మండల పరిధిలోని సీతారాంపురం స్టేజీ వద్ద జరిగిన రోడ్డు ప్రమా దంలో రెడ్డిగూడెం మండల అసిస్టెంట్ సర్వేయర్ కె.శ్రీనివాస రావు గాయాల పాల య్యారు. అదే మార్గంలో విస్సన్న పేట వెళ్తున్న సాయిరాం మ్యాంగో మార్కెట్ అధినేత, టిడిపి సీనియర్ నాయకులు రవీంద్ర రెడ్డి గమనించి వెంటనే రక్తమోడుస్తున్న శ్రీనివాసరావు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించి చికిత్స చేయించారు. అనంతరం తహశీల్దార్ కార్యాలయం వారికి సమాచార మందించారు.

ఎంఎల్‌సి ఓటర్లుగా నమోదు చేసుకోండి

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం :

ఇబ్రహీంపట్నం జాకీర్ హుస్సేన్ కళాశాలలో ఫామ్ 18 పత్రం అందజేసి ఎంఎల్‌సి ఓటర్లుగా నమోదు కావాలని బుధవారం సిఐటియు నేత మహేష్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి కృష్ణ, గుంటూరు గ్రాడ్యుయేట్ ఎంఎల్‌సి ఎన్నికలు మార్చి 2025లో జరగనున్నాయని దీనికి డిగ్రీ, బి టెక్, డిప్లొమా పూర్తయిన మూడు సంవత్సరాలు దాటిన ప్రతి ఒక్కళ్ళు అర్హులని నూతనంగా ఓట్లు నమోదు చేసుకోవాలని ఆన్లైన్, ఆఫ్‌లైన్‌లో నవంబర్ 6 వరకు అవకాశం ఉంటుందని తెలిపారు. యుటిఎఫ్ సిఐటియు ఆధ్వర్యంలో ఇబ్రహీంపట్నం కామ్రేడ్ వెలగా లక్ష్మణరావు భవన్‌లో ప్రతిరోజు సాయంత్రం ఐదు గంటల నుంచి రాత్రి 8:30 వరకు ఓట్ల నమోదు ప్రక్రియ చేస్తున్నామని తెలిపారు. ప్రోగ్రెసివ్ డెమొక్రటిక్ ఫోరం (పిడిఎఫ్) తరపున ప్రస్తుత ఎంఎల్‌సి కెఎస్ లక్ష్మణరావు పనిచేస్తున్నారని అన్నారు. నిరంతరం నిరుద్యోగ యువత కోసం ఉద్యోగ అవకాశాల కల్పన కోసం డిఎస్‌సి ఇతర ఉద్యోగ అవకాశాలు కల్పించాలని ఉపాధ్యాయుల సమస్యలపై సిపిఎస్ రద్దు చేయాలని కార్మికుల హక్కులకై శాసనమండలిలో తమ గళం వినిపించారని అన్నారు. అలాంటి ఉద్యమ అభ్యర్థులను రాబోయే రోజుల్లో గెలిపించుకోవాలని గ్రాడ్యుయేట్స్‌కు సిఐటియు నేత మహేష్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జాకీర్ హుస్సేన్ జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ షేక్ సాదిక్ అధ్యాపకులు బేగ్, రవీంద్ర, నాగరాజు, రవి పాల్గొన్నారు.

పత్తి పంటలపై అవగాహన

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : అధిక దిగుబడులు సాధించేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు జాతీయ ప్రత్తి పరిశోధనా సంస్థ శాస్త్రవేత్త డాక్టర్ భాగ్యలక్ష్మి బుధవారం అవగాహన కల్పించారు. మండలంలోని గరికపాడు కృషి విజ్ఞాన కేంద్రంలో శాస్త్రవేత్తలతో కలిసి పత్తి పొలాలను పరిశీలించారు. పత్తి పంటలను పరిశీలించిన అనంతరం ఆమె పత్తిలో చేపట్టిన అధిక సాంద్రతతో విత్తే పద్ధతి పెరుగుదలను నియంత్రించే రసాయనం, మేపిక్వాట్ క్లోరైడ్ ఉపయోగించి అధిక దిగబడులు సాధించాలన్నారు. నాణ్యమైన ఉత్పత్తిని సాధించేందుకు చేపట్టిన ప్రక్రియ ద్వారా రైతులకు మేలు చేకూరుతుందన్నారు. ఈ సాంకేతిక పరిజ్ఞానాన్ని ఈ ప్రాంత రైతులందరికీ అవగాహన కల్పించి పొలాల్లో ప్రదర్శనలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. గులాబీ రంగు పురుగు నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్త డాక్టర్ ఎన్ రాజశేఖర్, యంగ్ ప్రొఫెషనల్ జి.శోభిత రాణి పాల్గొన్నారు.

జనసేనలో చేరిక

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : పట్టణానికి చెందిన వైఎస్ఆర్ పార్టీ సోషల్ మీడియా కన్వీనర్ యర్రమసు రామకృష్ణ, వత్సవాయి మండలం మంగొల్లు గ్రామానికి చెందిన సీనియర్ ఎస్‌సి నాయకులు అన్నెపాగ నరసింహారావు, కందుల నరసింహారావు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీని వీడి మాజీ ప్రభుత్వ విప్ సామినేని ఉదయభాను సమక్షంలో జనసేనలో చేరారు.

పొలం పిలుస్తోంది కార్యక్రమంలో మాట్లాడుతున్న సురేష్

ముచ్చినపల్లి, మద్దులపర్వల్లో 'పొలం పిలుస్తోంది'

ప్రజాశక్తి - రెడ్డిగూడెం : వ్యవసాయ, అనుబంధ శాఖల అధికారులు ఆధ్వర్యంలో ముచ్చినపల్లె, మద్దులపార్వ గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా మండల వ్యవసాయ అధికారి ఆర్ సురేష్, రెడ్డిగూడెం రైతులకు వివిధ పంటల్లో వచ్చే పురుగులు తెగుళ్ళు పై అవగాహన కల్పించారు. వరిలో సుడి దోమ కనబడుతుందని నివారణకు అసిఫేట్ 300 గ్రాముల వేప నూనె 1500 పిపిఎం లీటర్ లేదా పైమెట్రోజైన్ 120 ఎంఎల్ ఎకరాకు పిచికారీ చేసుకోవాలని సూచించారు.. ప్రతి ఒక్క రైతు రైతు సేవ కేంద్రంలో ప్రదర్శించిన లిఈ పంటలి లిస్ట్‌లో సాగుచేసిన పంటలు, రకం పేర్లు చెక్ చేసుకోవాలని సూచించారు. ఏదైనా తేడా వుంటే రైతు సేవ కేంద్ర సహాయకుడు ద్వారా సరిచేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు పవన్, రఘాన్సి పశుసంవర్ధక శాఖ సహాయకురాలు ప్రమ సర్పంచ్ శ్రీనివాసరావు, జమలయ్య, ఎంపిటిసి మారయ్య పాల్గొన్నారు.

ప్రజాశక్తి
జిల్లా వార్తలు 7
గురువారం 17 అక్టోబర్ 2024

ర్యాగింగ్‌కు పాల్పడితే శిక్ష తప్పదు

సీనియర్ సివిల్ జడ్జి రామకృష్ణయ్య

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా): ఈవ్‌టీజింగ్, ర్యాగింగ్ అనేవి నేరమని, ఎవరైనా తోటి విద్యార్థులపై ర్యాగింగ్ పాల్పడితే ప్రొహిబిషన్ ఆఫ్ ర్యాగింగ్ యాక్ట్ - 1997 ప్రకారం ఒకసారి కేసు నమోదైతే 6 నెలల నుండి 3 సంవత్సరాల వరకు జైలు శిక్ష ఉంటుందని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కెవి రామకృష్ణయ్య అన్నారు. ప్రభుత్వం మెడికల్ కళాశాల నందు యాంటీ ర్యాగింగ్, యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ అనే అంశాలపై కృష్ణాజిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో బుధవారం మచిలీపట్నం మెడికల్ కళాశాలలో విద్యార్థులకు అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సీనియర్ సివిల్ జడ్జి కెవి రామకష్ణయ్య మాట్లాడుతూ ర్యాగింగ్ ఒక విష సంస్కృతి దానికి అందరూ దూరంగా ఉండాలని, ఒకసారి కేసు నమోదు అయితే వారి భవిష్యత్తు కోల్పోతారని అన్నారు. కాబట్టి కళాశాలలో సీనియర్లు జూనియర్ లు అని తేడా లేకుండా స్నేహపూర్వకంగా మెలగాలన్నారు.అలాగే కష్టపడి చదివి ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలన్నారు. కళాశాలల్లో యాంటి డ్రగ్ కమీటి ఏర్పాటు చేసి మాదకద్రవ్యాలు నిర్మూలన ప్రతి ఒక్కరు కషి చేయాలని అన్నారు.మహిళా పిఎస్ ఇన్స్పెక్టర్ వాసా వేంకటేశ్వర రావు మాట్లాడుతూ మాదకద్రవ్యాలు, గంజాయి రహిత సమాజమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని గంజాయి, మాదకద్రవ్యాలు అనేవి చెడు వ్యసనాలని, వాటి బారిన పడితే జీవితంలో కోలుకోలేరని, తాత్కాలిక సంతోషం కొరకు వాటిని సేవించడం అలవాటు చేసుకొని డ్రగ్స్ కు బానిసై జీవితాలను నాశనం చేసుకోవద్దని సూచించారు. సామాజిక మాధ్యమాలైన ఫేస్ బుక్, వాట్స్ అప్ ఇంస్టాగ్రామ్ లాంటి వాటి పట్ల జాగ్రత్తగా ఉండాలన్నారు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, సైబర్ నేరాలకు గురి అయితే వెంటనే 1930 గాని లేదా cybercrime.gov.in ద్వారా ఫిర్యాదు చేయాలని తెలిపారు. ఈ సదస్సులో మెడికల్ వైస్ ప్రిన్సిపాల్ ఆశలత, స్వర్ణలత, జిజిహెచ్ ఆర్‌ఎంఓ నిరంజన్ న్యాయవాదులు సి హెచ్ ముసలయ్య, అజ్మి తున్నిసా బేగం తదితరులు పాల్గొన్నారు.

అవనిగడ్డ తహశీల్దార్‌గా నాగమల్లేశ్వరరావు బాధ్యతలు

ప్రజాశక్తి-అవనిగడ్డ: అవనిగడ్డ మండలానికి నూతన తాసిల్దారుగా కె.నాగమల్లేశ్వరరావు బాధ్యతలు చేపట్టారు. ఆయన ఎన్నికల సందర్భంగా అవనిగడ్డ మండలానికి తాసిల్దారుగా విధులు నిర్వహించారు. ఇటీవల బదిలీలలో ఆయన సొంత ప్రాంతానికి వెళ్లగా తిరిగి ఆయనను అవనిగడ్డ మండలానికి బదిలీ చేశారు దీనితో బుధవారం అవనిగడ్డ మండల తాసిల్దార్‌గా బాధ్యతలు చేపట్టి ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్‌ను ఆయన కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు.

డిగ్రీ కళాశాల పరిశీలన

ప్రజాశక్తి-గన్నవరం: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలను బుధవారం ఉన్నత విద్య జోన్-2, రాజమహేంద్రవరం ప్రాంతీయ జాయింట్ డైరెక్టర్ డాక్టర్. ఎస్.శోభారాణి సందర్శించారు. కళాశాలకు సంబంధించిన అన్ని రకాల రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం కళాశాలలో తరగతి గదుల్ని పరిశీలించారు. తదనంతరం విద్యార్థులను ఉద్దేశించి తగినటువంటి సలహాలను, సందేశాన్ని ఇస్తూ దిశా నిర్దేశనం చేశారు. తరువాత అధ్యాపకులతో సమావేశమై కళాశాలలో నిర్వహించాల్సిన విధులను గురించి తగిన సూచనలు చేశారు.కళాశాలలో ఉన్నటువంటి మౌలిక సదుపాయాల్ని పరిశీలించి సంతృప్తిని వ్యక్తం చేశారు. కళాశాల అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది చేస్తున్న సేవలను కొనియాడారు.

పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి-గుడివాడ : నందివాడ మండలంలో పల్లె పండుగలో భాగంగా బుధవారం పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే వెనిగండ్ల రాము శంకుస్థాపన చేశారు. మండలంలోని పెదలింగాల, చినలింగాల, పుట్టగుంట గ్రామాల్లో నిర్వహించిన పల్లె పండుగ కార్యక్రమాల్లో ఎమ్మెల్యే రాము పాల్గొన్నారు. ఈ పర్యటనలో భాగంగా రూ.25 లక్షల నిధులతో నిర్మించనున్న సిసి రోడ్లకు భూమి పూజ నిర్వహించి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు పిన్నమనేని బాబ్జి, మండల టిడిపి అధ్యక్షుడు దానేటి సన్యాసిరావు, ఎండిఓ మల్లీశ్వరి, నాయకులు చేకూరు జగన్మోహనరావు, యలమంచిలి సతీష్, మద్దాలి ఇస్సాకు పాల్గొన్నారు. **చల్లపల్లి:** పారిశ్రామిక, ఐటి రంగ అభివృద్ధికి కృషి చేస్తానని అవనిగడ్డ శాసనసభ్యులు మండలి బుద్ధప్రసాద్ తెలిపారు. బుధవారం చల్లపల్లి గ్రామంలో రూ.1.27 కోట్లతో చేపట్టిన సీసీ రోడ్ల నిర్మాణానికి ఆయన భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చల్లపల్లి మండలంలో రూ.3.69 కోట్లతో పలు అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు చెప్పారు. సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి అధ్యక్షతన జరిగిన ఈ సభలో నియోజకవర్గ యువనాయకులు మండలి వెంకట్రామ్, ఎంపీపీ కోట విజయ రాధిక, వైస్ ఎంపీపీ మోర్ల రాంబాబు, ఎంపీడీఓ డాక్టర్ అనగాని వెంకటరమణ, పంచాయతీరాజ్ డీఈఈ పగడాల సురేష్‌బాబు, ఏఈఈ బొప్పన శ్రీనివాసరావు, మండల కో-ఆప్షన్ సభ్యులు షేక్ నబీఘోరీ, ఉపాధి చట్టం ఏపీఓ రాజ్ కుమార్, పంచాయతీ ఈఓ పీవీ మాధవేంద్రరావు తదితరులు పాల్గొన్నారు. **బంటుమిల్లి:** బంటుమిల్లి మండలం నాగేశ్వరావుపేట, మల్లేశ్వరం గ్రామాల్లో నిర్వహించిన పల్లె పండుగ కార్యక్రమంలో ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ శంకుస్థాపన చేశారు. నాగేశ్వరావుపేటలో రైతు భరోసా కేంద్రం, సచివాలయాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ తాత మహాలక్ష్మి, ఎఇ నగేష్, ఎంఈఓ త్రిపుర సుందరి వెంకటేశ్వరరావు, అంగన్వాడి సిడిపిఓ సముద్రవేణి, జడ్పిటిసి మలిశెట్టి వెంకటరమణ, పెడన

నియోజవర్గం జనసేన ఇంచార్జ్ పంచకర్ల సురేష్, కూనపరెడ్డి వీరబాబు, ఇల్లూరి లీలాకృష్ణ, బొర్ర కాశి బొడ్డు నాగరాజు, బడుగు వెంకటేశ్వరరావు, తాత రాజా, కరుణ జ్యోతి, జంపాని సూరి వంశి, కటకం రాజేష్, కాగిత కుమార్ తదితరులు పాల్గొన్నారు. **గన్నవరం:** పల్లెలకు పూర్వవైభవం తెచ్చేందుకే పల్లె పండుగ పేరుతో కూటమి ప్రభుత్వం అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టిందని ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అన్నారు . బుధవారం గన్నవరం నియోజకవర్గం బాపులపాడు మండలం లోని సిరివాడ గ్రామం లో రూ.20 లక్షల వ్యయంతో నిర్మించనున్న సిసి రోడ్డుకు, ఆరుగొలను గ్రామంలో రూ.19 లక్షల వ్యయంతో నిర్మించనున్న 2 సిసి రోడ్లకు, కానుమోలు గ్రామంలో రూ.23 లక్షల వ్యయంతో నిర్మించనున్న సిసి రోడ్డుకు, పెరికిడు గ్రామంలో రూ.14 లక్షల వ్యయంతో నిర్మించనున్న సిసి రోడ్డుకు , కొయ్యూరు గ్రామంలో రూ.13లక్షల వ్యయంతో నిర్మించనున్న సిసి రోడ్డుకు, బొమ్ములూరు గ్రామంలో రూ.8.50లక్షల వ్యయంతో నిర్మించనున్న సిసి రోడ్డుకు, బాపులపాడు గ్రామంలో రూ.70 లక్షల వ్యయంతో నిర్మించనున్న 4 సీసీ రోడ్లకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ గన్నవరం అధ్యక్షులు చలమలశెట్టి రమేష్, తెలుగు మహిళ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మూల్పూరి సాయి కళ్యాణి , సాగునీటి వినియోగదారుల సంఘాల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు ఆళ్ల వెంకట గోపాలకృష్ణారావు, పుట్టా సురేష్, మాదల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

మద్యం దుకాణాల ద్వారా భారీగా ఆదాయం

ప్రజాశక్తి-గన్నవరం: గన్నవరం సర్కిల్‌లోని మద్యం షాపుల నుంచి మొదట కిస్తీ ద్వారా ఆదాయం రూ.2.11 కోట్ల వరకు ప్రభుత్వానికి వచ్చింది. టెండర్ల ద్వారా సుమారు రూ.9.90 కోట్లు వచ్చింది. గన్నవరం సర్కిల్లో ఉన్న 23 మద్యం షాపులు ఉండగా 495 దరఖాస్తులు వచ్చాయి. ఒక్కో దరఖాస్తుకు రూ.2 లక్షల చొప్పున వీటి ద్వారా ప్రభుత్వానికి మొత్తం రూ.9.90 కోట్లు ఆదాయం వచ్చిన విషయం తెలి సిందే. ప్రస్తుతం దుకాణదారులు అందరూ మొదటి కిస్తీ మొత్తాన్ని ప్రభుత్వానికి చెల్లించారు. రూ.55 లక్షల స్లాబ్ దుకాణానికి రూ.9,16,667, రూ.65 లక్షల దుకాణాలకు రూ. 10,83,333 చొప్పున మొదటి కిస్తీగా చెల్లించాల్సి ఉంది. దుకాణాలు దక్కించుకున్నవారు 48 గంటల్లో ఆ మొత్తాన్ని చెల్లించారు. ఒకవేళ వారు చెల్లించకపోతే ఇబ్బందులు తలెత్తకుండా రిజర్వుగా మరో ఇద్దరిని లాటరీ ద్వారానే ఎంపిక చేశారు. అయితే వారికి అవకాశం లేకుండా నిర్దేశిం చిన సమయానికే దుకాణాలు దక్కించు కున్న వారందరూ మొదటి విడత కిస్తీ చెల్లించారు. రూ.55 లక్షల స్లాబ్ కు సంబం ధించి గన్నవరం, ఉంగుటూరు, బాపులపాడు మండలాల్లో 23 షాపులకు రూ.55 లక్షలకు చెందినవి 20 దుకాణాలు ఉన్నాయి. వాటి ద్వారా ప్రభుత్వానికి రూ.9.53 కోట్లు ఆదాయం సమకూరింది. మొదటి ఏడాది రూ.55 లక్షలు ఉన్న దుకాణానికి వచ్చే ఏడాది 10 శాతం పెంపుతో రూ.10.50 లక్షలు చెల్లించాల్సి ఉంటుంది. అదే రూ. 65 లక్షల దుకాణానికి రూ.71.50 లక్షలు చెల్లి చాల్సి ఉండడంతో ప్రభుత్వానికి వచ్చే ఆదాయం మొదటి ఏడాది. కంటే రెండో ఏడాది గణనీయంగా పెరగనుంది.దుకాణాలు దక్కించుకున్న వారందరూ నిర్దేశించుకున్న ప్రాంతాల్లో వాటిని ప్రారంభించాల్సి ఉంది. దీంతో వారంతా ఎక్కడైతే బాగుంటుందో ఆ ప్రాంతాల్లోని స్థలాల కోసం వెతుకులాట ప్రారంభించారు. దుకాణాలు పొందిన వారిలో చాలామంది లిక్కర్ వ్యాపారులు కావడంతో ముందే వారికి వివిధ ప్రాంతాల్లో స్థలాలు సిద్ధం చేసుకున్నారు. దుకాణాలు నిర్వహిస్తున్న వారిలో కూడా అనేక మందికి ఈసారి లాటరీ రాలేదు. దీంతో ప్రదేశం కోసం కొందరు వారితో సంప్రదింపులు చేశారు. గన్నవరం వ్యాప్తంగా 23 ప్రభుత్వ మద్యం దుకాణాలు రద్దు చేయడంతో పలువురు ఆ దుకాణాలు నిర్వ హించే ప్రదేశాలనే ఎంపిక చేసుకోవడానికి మొగ్గు చూపారు. మద్యం తాగేవారు ఆ ప్రదేశాలకు అలవాటు పడి ఉంటారని, కొందరు వ్యాపారులు ఆ స్థల యజ మానులతో మాట్లాడి అక్కడే సిద్ధం చేసుకున్నట్లు తెలు స్తోంది. గ్రామీణా ప్రాంతాల్లో ఎక్కువగా మేజర్ పంచా యతీల్లో వాటి ఏర్పాటుకు ప్రయత్నిస్తున్నారు. ఏదేమైనా ఈసారి ప్రభుత్వానికి గన్నవరం సర్కిల్ నుంచి ఆశించిన స్థాయిలో ఆదాయం రాలేదని వాదన ఉంది.

కాంట్రాక్టు లెక్చరర్ల నిరసన

ప్రజాశక్తి-అవనిగడ్డ: అవనిగడ్డ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పనిచేస్తున్న కాంట్రాక్టు లెక్చరర్ లందరూ ఏపీ కాంట్రాక్ట్ లెక్చరర్స్ అసోసియేషన్ ఇచ్చిన పిలుపుమేరకు తమను క్రమబద్ధీకరణలో భాగంగా రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేస్తూ పసుపు రిబ్బన్లతో బుధవారం విధులకు హాజరయ్యారు. కాంట్రాక్ట్ లెక్చరర్స్ క్రమబద్ధీకరణలో భాగంగా ప్రభుత్వానికి సానుకూలంగా వివిధ రకాలైన కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. గత ప్రభుత్వం జీవో నెంబర్ 114 ప్రకారం కాంట్రాక్టు లెక్చరర్స్ ని రెగ్యులర్ చేస్తామని చెప్పారు. ఈ ప్రభుత్వం ఆయన కాంట్రాక్టు లెక్చరర్స్ అందరిని రెగ్యులర్ చేయాలని కోరుతూ ఈ నెల 19వ తేదీ వరకు పసుపు రిబ్బన్లు ధరించి కళాశాల విధులకు హాజరు కావడం జరిగిందని అసోసియేషన్ ప్రతినిధులు తెలిపారు

ఫీజు చెల్లిస్తేనే లోపలకు రావాలి

నారాయణ కాలేజీలో విద్యార్థులపై ఒత్తిడి

ప్రజాశక్తి-కంకిపాడు: తాడిగడప మున్సిపాలిటీ పరిధిలోని వంద అడుగుల రోడ్డులోని శివాని భవన్ నారాయణ క్యాంపస్‌లో ఫీజు కట్టలేదని విద్యార్థులను బుధవారం కళాశాలలోకి అనుమతించలేదు. దసరా సెలవులు ముగించుకుని కాలేజీకి వస్తున్న విద్యార్థులను 85 శాతం ఫీజు కడితేనే లోపలకు రావాలని కాలేజీ యాజమాన్యం వారిని బయటే అడ్డుకుంది. దీంతో విద్యార్థులు తల్లిదండ్రులకు ఫోన్ చేయడంతో వారి నుంచి కమిట్మెంట్ తీసుకుని లోపలకు అనుమతించారు.

నేషనల్ హెల్త్ మిషన్‌లో ఖాళీల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానం

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా): రాష్ట్ర వైద్యారోగ్య శాఖ ఆదేశానుసారం ఎన్‌యుహెచ్‌ఎం (నేషనల్ హెల్త్ మిషన్) నాలుగు కేటగిరీలలో ఖాళీగా ఉన్న 20 పోస్టులను భర్తీ చేయడానికి అర్హత కలిగిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిని డాక్టర్ జి.గీతాబాయి ప్రకటనలో తెలిపారు. ఫార్మసిస్ట్ 2 పోస్టులు, ల్యాబ్ టెక్నీషియన్ 4, డేటా ఎంట్రీ ఆపరేటర్ 4, లాస్ట్ గ్రేడ్ సర్వీసెస్ 10 పోస్టులకు సంబంధించిన ఉద్యోగ ఖాళీలను భర్తీ చేయుటకు కష్ణా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ పరిధిలో జిల్లా కలెక్టర్ డికె బాలాజీ అనుమతితో 20 పోస్టులకు అర్హులైన అభ్యర్థులు నుండి దరఖాస్తులను కోరుతున్నట్లు తెలిపారు. నోటిఫికేషన్, దరఖాస్తు ఫారంను కృష్ణ డాట్ ఎన్ఐసి డాట్ ఇన్‌లో ఉంచడం జరిగిందని, పూర్తిచేసిన దరఖాస్తును జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయం మచిలీపట్నంలో ఈ నెల 17 నుండి 22వ తేదీ సాయంకాలం ఐదు గంటల్లోపు అందజేయాలని తెలిపారు.

రైతులకు అవగాహన

ప్రజాశక్తి-కంకిపాడు: మండలంలోని గొడవర్రు, మద్దూరు, కాసరలేనివారి పాలెం గ్రామాలలో పొలం పిలుస్తోందిలో భాగంగా బుధవారం రైతులకు అవగాహన కల్పించారు. మండల వ్యవసాయ అధికారి కిరణ్ రైతులకు ఎరువులు వాడకంపై అవగాహన కల్పించి, పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో రైతులతో పాటు రైతు భరోసా కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

ఇసుక రీచ్‌ను పరిశీలించిన జెసి

ప్రజాశక్తి - కంచికచర్ల : జిల్లాలో 15 ఇసుక రీచ్‌ల ద్వారా వినియోగదారులకు తక్కువ ధరకే ఇసుక అందుబాటులోకి తీసుకు వస్తున్నట్లు జిల్లా జెసి డాక్టర్ నిధీ మీనా అన్నారు. వినియోగదారులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా పారదర్శకంగా ఉచిత ఇసుకను సరఫరా చేసేలా అన్ని చర్యలు తీసుకోవాలని ఆమె అధికారులను ఆదేశించారు. ఉచిత ఇసుక విధానంలో భాగంగా కంచికచర్ల మండలం పెండ్యాల 1,2 రీచ్‌ల పరిధిలోని నందిగామ మండలం కంచెల గ్రామంలోని ఇసుక స్టాక్ యార్డ్, వత్సవాయి మండలం శనగపాడు, ఇందుపల్లి స్టాక్ యార్డ్‌లను బుధవారం జాయింట్ కలెక్టర్ నిధి మీనా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో కొత్తగా 15 రీచ్‌లను ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవడం జరిగిందని దీనిలో భాగంగా ముందుగా నేడు నాలుగు రీచ్‌లను ప్రారంభించినట్లు తెలిపారు. ప్రస్తుతం నీటి ప్రవాహం ఉండటంతో 11 రీచ్‌లలో ప్రవాహం తగ్గిన వెంటనే ప్రారంభించి ఇసుకను అందుబాటులో ఉంచుతామన్నారు. ప్రస్తుతం ప్రారంభించిన నాలుగు రీచ్‌లలో 3 లక్షల 69 వేల మెట్రిక్ టన్నులతో పాటు ఇప్పటికే అందుబాటులో ఉన్న మొగులూరు, కీసర, అనుమంచిపల్లి స్టాక్ యార్డ్‌లతో కలిపి మొత్తం 15 రీచ్‌లకు సంబంధించి 11 లక్షల 6వేల మెట్రిక్ టన్నుల ఇసుక అందుబాటులో ఉందన్నారు. ప్రారంభించిన రీచ్‌లకు సంబంధించి మ్యాపింగ్ నిర్వహిస్తున్నందున రేపటి నుండి అన్‌లైన్, ఆఫ్‌లైన్ విధానంలో ఇసుకను వినియోగదారులకు అందుబాటులో ఉంచడం జరుగుతుందన్నారు.

కొత్తగా ప్రారంభించిన రీచ్‌లలో జిల్లా ఇసుక స్థాయి కమిటీ టన్ను ఇసుక 232 రూపాయల ధరను నిర్ణయించినట్లు తెలిపారు. స్టాక్ యార్డ్‌లలో ఇసుక సరఫరా, నిల్వలకు సంబంధించిన నివేదికలు ఎప్పటికప్పుడు ప్రదర్శించడంతో పాటు అన్‌లైన్‌లో ఉంచాలని జాయింట్ కలెక్టర్ నిధి మీనా అన్నారు. ఈ కార్యక్రమంలో గనులు భూగర్భ శాఖ సహాయ సంచాలకులు వీరాస్వామి, నందిగామ ఆర్‌డివో బాలకృష్ణ ఉన్నారు.

నందిగామ నియోజకవర్గం పరిధిలో 9 ఇసూక రీచ్‌లలో ఇసుక తవ్వకాలు జరిపి తక్కువ ధరకు ఇసుక అందుబాటులోకి తీసుకువచ్చినట్లు నందిగామ ఎంఎల్‌ఎ తంగిరాల సౌమ్య అన్నారు. కంచికచర్ల మండలం పెండ్యాల గ్రామ పరిధిలో మునేరు నుండి ఇసుక తవ్వకాలకు గుర్తించిన రెండు రీచ్‌లలో బుధవారం ఇసుక తవ్వకాలను, స్టాక్ పాయింట్లను ఆమె ప్రారంభించారు. నియోజకవర్గంలో పెండ్యాల -1,2 వేములపల్లి -1,2, కాసరబాద, పొక్కునూరు-1,2 ఉస్తేపల్లి ప్రాంతాల్లో ఇసుక రీచ్ లలో తవ్వకాలకు అనుమతులు వచ్చాయన్నారు. టన్ను ధర 232 రూపాయలకు వినియోగదారులకు అందజేయనున్నట్లు తెలిపారు. ట్రాక్టర్ ఇసుక 1040లు, లారీ ఇసుక 2342లకు లభ్యం అవుతుందని తెలిపారు. దీపావళి నుంచి ఏపీలో ఉచిత గ్యాస్ సిలిండర్ల పథకం ప్రారంభించనున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మైనింగ్, రెవెన్యూ అధికారులు, మండల టిడిపి అధ్యక్షుడు కోగంటి బాబు, తదితరులు పాల్గొన్నారు.

కంచికచర్ల మండలం పెండ్యాలలో ఇసుక రీచ్ పరిశీలిస్తున్న జెసి నిధి మీనా

స్టాక్ పాయింట్లు ప్రారంభించిన ఎంఎల్ఎ సౌమ్య

'వి' అధునాతన టెక్నాలజీ

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : పరిశ్రమలు రోజువారీ అనుభవాలను సరికొత్తగా తీర్చిదిద్దేందుకు 5జీ, ఐవోటీ వంటి అధునాతన సాంకేతికతలను తాము అందుబాటులోకి తీసుకువచ్చినట్లు వి మొబైల్ సంస్థ ప్రతినిధి కె.ఈశ్వర్ ప్రసాద్ తెలిపారు. నగరంలోని సంస్థ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వివరాలను తెలిపారు ఇటీవల జరిగిన ఇండియా మొబైల్ కాంగ్రెస్ (ఐఎంసి) 2024 టెలికాంకు సంబంధించి అధిక పద్ధతులను తమ సంస్థ ప్రదర్శించిందని తెలిపారు. 'ది ఫ్యూచర్ ఈజ్ నౌ' నినాదం ఈ ఏడాది ఐఎంసి థీమ్‌గా ఉందని తెలిపారు. నేటి సవాళ్లను పరిష్కరించేందుకు, తక్షణ ప్రభావం చూపేందుకు ఉపయోగపడే టెక్నాలజీ ఆధారిత సొల్యూషన్స్‌ను అందించడంపై వి కి గల నిబద్ధతను ఇది ప్రతిబింబిస్తుందని తెలిపారు. వ్యాపారాలు, ప్రజల జీవనాల్లో, పని విధానాల్లో, కనెక్ట్ అయ్యే విధానాల్లో అధునాతన టెక్నాలజీలతో తాము ఏ విధంగా పరివర్తన తెస్తున్నామనేది వి తమ 'ఫ్యూచర్ ఈజ్ లైవ్' థీమ్ ద్వారా వి ప్రదర్శిస్తోందని తెలిపారు.



మాట్లాడుతున్న బొర్ర కిరణ్

'సూపర్ సిక్స్ అంతా బూటకమే'

ప్రజాశక్తి - నందిగామ : కూటమి ప్రభుత్వం ప్రవేశ పెట్టిన సూపర్ సిక్స్ అంతా బూటకమే అని పిసిసి ప్రధాన కార్యదర్శి, జిల్లా పరిశీలకులు మువ్వ మోహనరావు, జిల్లా డిసిసి అధ్యక్షుడు బొర్ర కిరణ్ పేర్కొన్నారు. బుధవారం నందిగామ, మైలవరం జగ్గయ్యపేట నియోజకవర్గాల కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకుల సమావేశం బొర్ర కిరణ్ అధ్యక్షతన నందిగామ పార్టీ కార్యాలయంలో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా కాంగ్రెస్ పార్టీ పరిశీలకులు మువ్వా మోహన్ రావు మాట్లాడారు. భవిష్యత్తులో కాంగ్రెస్‌కు దేశంలో మంచి అవకాశాలు ఉన్నాయన్నారు. బొర్ర కిరణ్ మాట్లాడుతూ నియోజకవర్గ ప్రతి నాయకులు సమన్వయంతో పనిచేసి, కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు రేపాల మోహన్‌రావు పోతురాజు ఏసుదాసు, పాలెట్ సతీష్, మంద వజ్రయ్య, చిన్న అంతయ్య, తదితర కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

విదేశీ విద్యాదీవెన బకాయిలను తక్షణమే విడుదల చేయాలి : విష్ణు

ప్రజాశక్తి - విజయవాడ : జగనన్న విదేశీ విద్యాదీవెన బకాయిలను కూటమి ప్రభుత్వం తక్షణమే విడుదల చేయాలని వైసిపి సెంట్రల్ నియోజకవర్గ సమన్వయకర్త మల్లాది విష్ణు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన కార్యాలయం బుధవారం ఓ ప్రకటనను విడుదల చేసింది. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత చంద్రబాబు పెట్టిన రూ.1,778 కోట్ల ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయిలను క్లియర్ చేసిందని.. కక్ష సాధింపులతో విద్యార్థుల జీవితాలతో ఎప్పుడూ ఆడుకోలేదని ఈ సందర్భంగా గుర్తుచేశారు. కానీ విదేశీ విద్యా దీవెన పథకానికి కూటమి ప్రభుత్వం పాతరేస్తోందని ఈ సందర్భంగా ఆరోపించారు. టీడీపీ హయాంలో ఊరూ పేరు లేని, అసలు ఉన్నాయో లేవో తెలియని యూనివర్సిటీలకూ విదేశీ విద్యాదీవెన పథకాన్ని వర్తింపజేసి దోచుకున్నారని మండిపడ్డారు. 2016-17 కి సంబంధించి 3,326 మందికి రూ. 318 కోట్ల బకాయిలు పెట్టి వదిలేశారని దుయ్యబట్టారు. 2014-19 మధ్య కాలంలో ఎన్టీఆర్ విదేశీ విద్య ఆదరణ పథకానికి రూ.32.71 కోట్లు విడుదల చేసిన కూటమి ప్రభుత్వం.. గత ప్రభుత్వంలో దరఖాస్తు చేసుకున్న వారిని పక్కనపెట్టడం సరికాదని మల్లాది విష్ణు అన్నారు. ఉద్యోగాలు చేస్తున్న వారికి బకాయిలు విడుదల చేసి.. ప్రస్తుతం చదువుకుంటున్నవారిని నిర్లక్ష్యం చేయడం దుర్మార్గమన్నారు.

రోడ్డు, ర్యాంప్ పనులు పూర్తి చేయాలి

కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న సత్యబాబు, ఆదిలక్ష్మి

ప్రజాశక్తి - విజయవాడ : స్థానిక 50 డివిజన్ తేత్రా స్వామి పిలై స్ట్రీట్ రోడ్డు, ర్యాంపు నిర్మాణం పనులు మంజూరయినప్పటికీ నేటికీ ఆ పనులను నగరపాలక సంస్థ పూర్తి చేయనందున స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని సిపిఎం ఫ్లోర్‌లీడర్ బోయి సత్యబాబు, ఆ పార్టీ మాజీ కార్పొరేటర్ జి.ఆదిలక్ష్మీ అన్నారు. ఈ మేరకు నగర కమిషనర్ ధ్యానచంద్రకు వారు బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వెంటనే రోడ్డు, ర్యాంపు నిర్మాణం పూర్తిచేయాలని కోరారు. వర్షం నీటి ముంపునకు గురవుతున్న మహంతిపురం జడ పాపయ్య వీధి, తదితర వీధుల్లో వర్షం నీరు నిల్వ ఉండటం వల్ల తరచూ ప్రజలు ప్రమాదాలకు గురవుతున్నారని అన్నారు. ఈ రహదారి పరిస్థితిపై అధికారులకు పలుసార్లు వివరించినా పట్టించుకోవడం లేదన్నారు. డివిజన్‌లో పల్లంగా ఉన్న పలు రోడ్డులను ఎత్తు పెంచి వాటి నిర్మాణాలను పూర్తిచేయాలని కోరారు. ఇటీవల వర్షానికి గొల్లపాలెం గట్టు కొండ ప్రాంతంలో కూలిన రిటైనింగ్ వాల్, ఒడుగు వెంకటేశ్వరమ్మ, చెక్క వెంకన్న ఇంటి వద్ద రిటైనింగ్ వాల్ నిర్మాణ పనులకు వెంటనే మంజూరు చేసి, వాటిని పూర్తి చేసి, స్థానిక ప్రజల ఇబ్బందులను తొలగించాలని కోరారు. గొల్లపాలెం గట్టు వాటర్ ట్యాంక్ నిర్మించి 30 సంవత్సరాలు అవుతుండటంతో వాటర్ ట్యాంక్ శిథిలావస్థకు చేరుతుందని, వెంటనే వాటర్ ట్యాంక్ రిపేర్ పనులను పూర్తి చేయాలని కోరారు. వాటర్ పైప్ లైన్లు కోసం తవ్విన రోడ్డు ప్యాచ్ వర్క్‌లను రెస్టోరేషన్ వెంటనే పూర్తి చేయాలన్నారు. ఇటీవల తరచూ కురుస్తున్న వర్షాలకు డివిజన్లో పలు రహదారులు దెబ్బతిని పాడైపోయాయని, వెంటనే గోతులప్యాచ్ వర్క్‌లను, దెబ్బతిన్న డ్రైనేజీ కల్వర్ట్లు పూర్తిచేయాలని అన్నారు. దీనిపై కమిషనర్ స్పందిస్తూ డివిజన్‌లో రహదారి, ర్యాంప్ పనులతో పాటు పెండింగ్ వర్క్స్ పూర్తి అయ్యేలా చర్యలు తీసుకుంటామని హామీనిచ్చినట్లు ఫ్లోర్‌లీడర్ సత్యబాబు తెలిపారు.

ఇందిరా ఐవిఎఫ్‌లో ఆధునిక ఫర్టిలిటీ చికిత్స

ప్రజాశక్తి - హెల్త్ యూనివర్సిటీ : గర్భధారణ సమస్యల కారణంగా సవాళ్లతో కూడిన సుదీర్ఘ ప్రస్థానం తరువాత 29 ఏళ్ల మహిళ భక్తి (పేరు మార్చబడింది) విజయవంతంగా గర్భం దాల్చింది. విజయవాడలోని ఇందిరా ఐవిఎఫ్‌లో అత్యాధునిక ఫర్టిలిటీ చికిత్సను తీసుకున్న తరువాత.. ఆరోగ్యకరమైన బిడ్డకు జన్మనిచ్చింది. ఈ సందర్భంగా ఇందిరా ఐవిఎఫ్‌లో గైనకాలజిస్టు, ఐవిఎఫ్ నిపుణులు అయిన డాక్టర్ కవిత చలసాని మాట్లాడుతూ ఆమె ఎనిమిదేళ్లకు పైగా గర్భధారణ సమస్యలతో ఆమె పోరాడిందన్నారు. వైద్యపరీక్షల్లో ఆమె అండాశయం కుచించుకుపోయి ఉన్నట్టుగా గుర్తించారన్నారు. మరొక ఆస్పత్రిలో గర్భధారణ కోసం చేసిన అనేక ప్రయత్నాలు విఫలం అయ్యాయని, ఇందులో ఆరుసార్లు అండాశయం నుండి గుడ్డు రావడానికి వైద్యం తీసుకున్నారన్నారు. రెండుసార్లు గర్భాశయంలో వీర్యనిక్షేపణ కూడా ఉన్నాయని, క్లిష్టతరమైన పరిస్థితులను అధిగమించి, ఇందిరా ఐవిఎఫ్‌లోని నిపుణుల సాయంతో ఆమెకు చికిత్స విజయవంతం అయిందన్నారు. ఇందిరా ఐవిఎఫ్ కేంద్రానికి ఆమె చేరుకునే సమయానికి ఆమె అండాశయం గణనీయంగా కుచించుకుపోయి ఉన్నట్లు వైద్యపరీక్షల్లో తేలిందని, సహజపద్ధతుల్లో ఆమె గర్భం దాల్చగల అవకాశాలను పరిమితం చేసేశాయని, ఆమె విషయంలోని సంక్లిష్టతల దృష్ట్యా ప్రత్యేకించిన ఫర్టిలిటీ చికిత్స ప్రణాళికను సూచించామన్నారు. ఇంట్రాసైటోప్లాస్మిక్ స్పెర్మ్ ఇంజెక్షన్ (ఐసిఎస్ఐ) అనే అత్యాధునిక విధానం ఆమె విషయంలో గర్భందాల్చే అవకాశాలు పరిశీలించి, చికిత్స సఫలమై అంతిమంగా ఆరోగ్యకరమైన బాబును ప్రసవించినట్లు తెలిపారు.

డాక్టర్ కవిత చలసాని

వినతిపత్రం అందజేస్తున్న బాధితులు

వరద సాయం కోసం వినతి

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : మూలపాడు గ్రామపంచాయతీ పరిధిలో వరదలకు సర్వం కోల్పోయిన 168 కుటుంబాలకు వరద సాయం అందకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, ప్రభుత్వ అధికారులు చొరవ తీసుకొని నగదు ఖాతాలో జమ అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని కోరుతూ తహశీల్దార్ వెంకటేశ్వర్లుకు మూలపాడు ముంపు బాధితులు బుధవారం వినతిపత్రం అందజేశారు. గ్రామంలో సుమారు నాలుగు కోట్లకు పైగా వరద సాయం బ్యాంకు ఖాతాలకు జమ అయినప్పటికీ 168 కుటుంబాలు సర్వం కోల్పోయిన వారికి సాయం అందలేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమ ఖాతాల్లో రూ.25 వేలు జమయ్యేలా ప్రభుత్వం అధికార యంత్రాంగం పరిశీలించి చొరవ తీసుకోవాలని కోరుతున్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో జిల్లా టిడిపి తెలుగు యువత కార్యదర్శి గరికపాటి శివ, గంజి చిరంజీవి, బాధిత మహిళలు పాల్గొన్నారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం... ప్రజల పక్షం

పుట్టినరోజు, వివాహ వేడుక, పదవీ విరమణ, జయంతి, వర్ధంతి, శ్రద్ధాంజలి మరియు లీగల్ మొదలగు అన్నిరకాల ప్రకటనలకై...

మీ బంధు మిత్రులకు తక్కువ సమయంలో సమాచారం తెలపాలంటే తక్కువ ఖర్చుతో ప్రకటనలకై మీ సమీపంలోని ప్రజాశక్తి కార్యాలయంలో గానీ లేదా క్రింది నెంబర్‌కు గానీ సంప్రదించగలరు.
సెల్ నెం: 94900 99530, 94900 99218

విజ్ఞప్తి
స్థానిక వార్తలతో పాటు, జాతీయ, అంతర్జాతీయ వార్తలు, విశ్లేషణల సమాహారం... ప్రజాశక్తి. చందా దారులుగా చేరండి.
94900 99218, 9490099530 నెంబర్లను సంప్రదించండి.